ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯33.
సాలుచందా 1-8-0.

సంపాదకుడు :
ఆండ్ర శేషగిరిరావు, బి.ఏ.

సంపుట : ౫. ధాతు, ఫాల్గుణము : మార్చి, 1937. సంచిక : ౮.

సంపాదకీయ సమాలోచన

భారతదేశమున ఎన్నికల సంబరము :—

సంక్రాంతితో మొదలైన ఎన్నికల సంబరము ఇంకను పూర్తిగ తీరలేదు. అస్సాము, బెంగాలు, పంజాబు రాష్ట్రములందు ఎలక్షన్ బూత్‌లు జనవరి 18-వ తేదీని తెరువబడినవి. బ్రిటిష్ ఇండియాకు చెందిన పదునొకండు రాష్ట్రములలోను ఎన్నికలసంబరము తీవ్రతరముగ సాగినది. స్వదేశసంస్థానములు చేరని బ్రిటిష్ ఇండియా జనాభా 27,15,26,933 మంది ఈ ఇరువదియెనిమిదికోట్లమందిలోను మూడుకోట్లమందిమాత్రము ఓటర్లుగా నమోదుచేయబడిరి. ఇందు పలువురు నిరక్షరాస్యులు, ఏబదిలక్షలమంది స్త్రీలు. మొత్తము పదునొకండురాష్ట్రములందును కలిసియున్న ఎన్నికస్థానములు 1845 మాత్రమే, కాని అభ్యర్థులు 5000 పైబడియుండిరి. వీనికి తోడు ఇంతకాలమును శాసనసభలకు దూరముగ నుండిన కాంగ్రెసుపార్టీ ఎన్నికలలో పాల్గొనెను. ఇక కోలాహలమునకు కొదువయేమి? సేతువు మొదలుకొని శీతనగమువరకును ప్రతిబ్రిటీష్ ఇండియాపౌరుడును ఎలక్షను జ్వరమునకు గురియయ్యెను.

౨. రైతుసీట్లలో జమీందారుల ఓటమి :—

ఇటీవల కాంగ్రెస్ జమీందారులకు వ్యతిరేకముగా తీవ్రతరప్రచారము గావించుచున్నది. దాని ఫలములు ఇతరరాష్ట్రములందు ఎట్లున్నను మన మదరాసు రాజధానియందు ముఖ్యముగ మన ఆంధ్రరాష్ట్రమున ఈ ఎన్నికలలో స్పష్టముగ కనిపించినవి. బొబ్బిలిరాజు, పిఠాపురము మహారాజు, పిఠాపురము యువరాజు. వెంకటగిరి యువరాజు, వెంకటగిరి కుమారరాజు మున్నగు జమీందారులు రైతుసీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులతో పోటిపడిరి. హెచ్చు ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులు జమీందారులను ఓడించిరి. కాని ఇది యంతగ సంతోషింపదగిన విషయముకాదని మా అభిప్రాయము. రైతుసీట్లు జమీందారులకు స్వస్థా

నముయుకావు. తమ ధనబలమునుచూచుకొని వారిస్థానములకు ఎగబడినారు. ఎగబడినందులకు వారికి ఓటర్లు తగిన గుణపాఠము నేర్పినారు. కాని వారి స్వస్థానములుకాని స్థానములందు వారిని ఓడించితిమనుట ఒక గొప్పవిషయముకాదు. జమీందారులకు ప్రత్యేకము సీట్లున్నవి. ఆసీట్ల ఎన్నికలలో కాంగ్రెస్ జయించియుండెనేని జమీందారుల ప్రాబల్యము నిజముగ తగ్గినదని చెప్పకతీరదు. కాని జమీందారీసీట్లలో ఒక్కటికూడ కాంగ్రెస్ పాలిట బడలేదు.

౯. జమీందారీసీట్లు : కాంగ్రెస్ అభ్యర్థులు :—

రాజధాని మొత్తముమీద జమీందారులకు ప్రత్యేకింపబడిన సీట్లు ఆరు. ఈ ఆరింటిలో మూడుస్థానములకు మాత్రము కాంగ్రెస్ అభ్యర్థులను నిలిపినది. ఆముగ్గురు అభ్యర్థులుకూడ ఓడిపోయిరి. ఒకవంక జమీందారులకు వ్యతిరేకముగ తీవ్రతరప్రచారము సాగించుచు జమీందారీసీట్లకు అభ్యర్థులను నిలుపుట పాలసీ యెట్లయినదో మాకు తెలియుట లేదు. ఎలక్షన్ సందర్భమున నడిచిన సంగతులనుబట్టికూడ కాంగ్రెస్ జమీందారీసీట్లకు అభ్యర్థులను నిలిపినదేకాని అందు గెలిచితీరవలయునను దృష్టితో పనిచేసినట్లే కనిపించదు. దేశభక్తి, ఉదారాశయములుగల జమీందారులను నమ్మించి అభ్యర్థులుగా నిలిపి వారి జయమునకు కాంగ్రెస్‌సంస్థ ఏవిధముగను సాయముచేయక పోవుటయేగాక జమీందారులపై విచ్చలవిడిగా వ్యతిరేకప్రచారము సాగించి ఒక విధముగా ఆ అభ్యర్థుల అపజయమునకు సాయపడినది. రైతుసీట్లకు జమీందారులు ఎగబడుచున్నారు కావున జమీందారుసీట్లకు మనమేల ఎగబ్రాకరాదు అను ఒక్క ఉద్దేశముతోనే కాంగ్రెస్ జమీందారుసీట్లకు అభ్యర్థులను నిలిపినట్లు కనిపించుచున్నది. ఈ జమీందారీసీట్లకు కాంగ్రెస్‌సంస్థ అసలే అభ్యర్థులను నిలపకపోయినచో ఉత్తమముగానుండియుండునను విషయమును ఈ ఎన్నికలు ప్రస్ఫుటము చేసినవి.

౯. తలచినచో రాజ్యాంగమును భగ్నము చేయవచ్చును :—

కాంగ్రెస్‌కు ఆరురాష్ట్రములందు మెజారిటీవచ్చినది. ఈ ఆరురాష్ట్రములందును కాంగ్రెస్‌వారు తలచినచో మంత్రిత్వమును స్వీకరింపకయు, శాసనసభాధ్యక్షుని యెన్నుకొనకయు రాజ్యాంగమును భగ్నముచేయవచ్చును. ఈనెల తుదివారమునగాని కాంగ్రెస్‌వారు అధికారస్వీకారమునుగూర్చి తుదినిర్ణయమునకురారు. క్రొత్తరాజ్యాంగము ఏప్రియలు ౧-వ తేదీని అమలులోకి రావలసియున్నది. అధ్యక్షుడు, మంత్రులు ఏర్పాటుకానిది క్రొత్తరాజ్యాంగము ఎట్లు అమలుకునికి వచ్చును? కాంగ్రెస్‌వారి నిర్ణయము తెలియువరకును ఆయారాష్ట్రముల గవర్నరులు తొందరపడి ఏమియు చేయకుండుట మంచిదని ఆంగ్లో ఇండియన్ పత్రికయగు మద్రాసు మెయిలుకూడ హితబోధచేయుచున్నది.

౯. ఉపాధ్యాయులు ఎలక్షన్ ఏజెంట్లు అయినారు :—

రాజమంద్రి ట్రెయినింగుకాలేజీ ఉపాధ్యాయసంఘమున ఉపన్యసించుచు ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధ్యక్షులయిన కట్టమంచి రామలింగారెడ్డిగారు ఇట్లు చెప్పినారు: 'విద్యా

సంస్థలు జిల్లాబోర్డులయు, మునిసిపాలిటీలయు యాజమాన్యమున నుండుటచే ఆసంస్థలయందు పనిచేయు ఉపాధ్యాయులు ఎలక్షను సమయములందు జిల్లాబోర్డు అధ్యక్షులకును, మునిసిపల్ అధ్యక్షులకును ఏజెంట్లుగ నుండవలసి వచ్చుచున్నది. పైయధికారుల మాటను ఈవిషయమున తీసివేయుటకు ఉపాధ్యాయులకు వలయు ధైర్యము లేకున్నది. వారివృత్తికి ఎంతమాత్రము సంబంధములేని పనిని ఉపాధ్యాయులను చేయమను జిల్లాబోర్డు, మునిసిపాలిటీ అధ్యక్షులకు తగు గుణపాఠము చెప్పగల అధికారము ఒక్క ప్రజాసంఘమునకేగలదు.' ఇందును గూర్చి విశేషవిమర్శ అనవసరము.

౯. నైజాము సర్కారు జూబిలీ:—

మహాఘనతవహించిన సర్ ఉస్మాన్ ఆలీఖాన్ బహదూరువారు హైదరాబాదు సంస్థానపు గద్దెయెక్కి ఫిబ్రవరిమాసమునకు పాతికేండ్లు నిండుటచే నిజామురాష్ట్రమునందంతటను జూబిలీ మహోత్సవము గావింపబడినది. నిజామురాష్ట్రపు జనాభాలో సగభాగమునకు పైగా ఆంధ్రులగుట ఈ జూబిలీ ఉత్సవములతో ఆంధ్రులకు ప్రత్యేకసంబంధ మేర్పడుచున్నది. హిందూదేశమునందలి 562 సంస్థానములలోను జనాభానుబట్టి, విస్తీర్ణమునుబట్టి, రాబడినిబట్టి నిజామురాష్ట్రము అగ్రగణ్యమైనది. మరియు ప్రస్తుతపు నైజాముగారు పరిపాలన ప్రారంభించినప్పటినుండియు హైదరాబాదు రాజ్యమున అభివృద్ధిపద్ధతు లనేకములు ప్రవేశపెట్టబడినవి. ప్రవేశపెట్టదగిన క్రొత్త సంస్కరణములును పెక్కుగలవు. వీనినిగూర్చి తగు ఆలోచన సాగుచున్నదనుటను జూబిలీసందర్భమున నిజాముగారిచ్చిన ఉపన్యాసము స్పష్టముచేయుచున్నది.

౯. శారదా యాక్టు : పురోహితుల బాధ్యత :—

ఇటీవల ఒక శారదాయాక్టు కేసులో మదరాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిసు పాండురంగరావుగారిచ్చిన తీర్పువలన వధూవర తలిదండ్రులకంటె వివాహముజరిపిన పురోహితులకు ఎక్కువ శిక్షఉండునట్లు ఏర్పడినది. ౘపివాహమును నిరోధింపలేక పోయిననే తలిదండ్రులకు శిక్ష. కాని సదరు వివాహమును ఎంచినందులకుగల శిక్షయావత్తును పురోహితుని తలమీదనేపడును. వధూవరుల పుట్టుక సర్టిఫికెట్టులు, జాతకములు స్వయముగ చూచి వారికి వివాహోచితవయస్సు వచ్చినదని తృప్తిపడినతప్ప పురోహితుడు తానా వివాహమును గావింప నంగీకరింపకూడదు. ఇది తెలియక ఆతడు శారదాయాక్టు నతిక్రమించుచో జరిమానాకును, ఖైదుశిక్షకును కూడ పాత్రుడగును.

౯. మధ్యరాష్ట్రమున ఆంధ్రుల విజయము :—

ఆంధ్రుడు కీర్తిప్రాభవములనుగలిగి వర్తించుచున్న రాష్ట్రేతర భాగములలో మధ్యరాష్ట్రము ఒకటి. ఆరాష్ట్రమునందలి ఒకడివిజనునకు ఆంధ్రుడగు ఎన్.హనుమంతరావుగారిని కాంగ్రెస్‌వారు ఈ ఎన్నికలలో నొక అభ్యర్థిగా నిలిపినారు. మరి ఇరువురితో పోటీ యేర్పడి

నను తుదకు హనుమంతరావుగారే జయమందిరి. వీరి జయమునకు కాంగ్రెస్ బలముకంటె వ్యక్తిబలమే ఎక్కువ కారణమైనదని చెప్పకతీరదు. మధ్యరాష్ట్రములలో ఆంధ్రవ్యక్తులకు అతిశయప్రాబల్యముగలదు. కావుననే ఆరాష్ట్రమున మరియొక ఆంధ్రనాయకుడు కాంగ్రెస్సుకు ఎదురొడ్డియు ఎన్నికలందు గెలుపొందినాడు ఆప్రజ్ఞాధురీణునినామము ఈశ్వగంటి రాఘవేంద్రరావుగారు. కాంగ్రెస్‌ను ఎదిరించినందుకు ఒకవైపున ఆయనను నిరసించుచునే ఆంధ్రప్రాభవప్రాబల్యమును పరరాష్ట్రమున ప్రదర్శింపజాలినందులకు మరియొకవైపున ఆయనను అభినందింపకుండుటకు నిజమైన ఆంధ్రహృదయము అంగీకరింపదు.

శ్రీ. సి. వై. చింతామణిగారి ఓటమి :—

పరరాష్ట్రమున ఆంధ్రప్రాభవమును ప్రదర్శించుచున్న ఆంధ్రప్రజ్ఞామతులలో అగ్రగణ్యులైన సి. వై. చింతామణిగారు ఎన్నికలలో ఓడిపోయినారు. వారి ఓటమి మితవాద తత్త్వమునకే ఒక గట్టిదెబ్బ. పలువత్సరములుగ కాంగ్రెస్‌కు ఎదురొడ్డి నిలుచుచున్న మితవాదనాయకులలో చింతామణిగారు తొలుత పేర్కొనదగినవారు. ఆయన సంపాదకత్వమున వెలువడుచున్న దినపత్రికయగు 'లీడరు' నెలలతరబడిని కాంగ్రెస్ తత్త్వమును, విధానమును నిరసించుటయందే శ్రద్ధధానమైయున్నది. బహుళముగా ఆ పత్రిక సంపాదకీయవ్యాసములందు కాంగ్రెస్ నాయకులు దూషింపబడుచువచ్చిరి. అంతమాత్రమున ఆయన నూతన సంస్కరణములను వరప్రసాదముగ ఆహ్వానించెనని తలచుట పొరపాటు. రాష్ట్రములందు ఇపు డున్న ద్వంద్వవిధానముకంటె ఇకమీదరాబోవు అటానమీయే అధ్వాన్నమైనదని ఆయన ఘంటాపథముగ వాకొనినారు. మొదటి రౌండు టేబిలు సమావేశమునందును, లోధియన్ కమిటీయందును ఆయన వాదము వ్యతిరేకవాదమే అయినది. ఇకమీద ఇట్టివారికి నాయకత్వమువచ్చుట దుస్తరము. అయినను ఆయన పూర్వచరిత్ర ఆయన ప్రతిష్ఠను చిరకాలము నిలుపుటకు సమర్థమైయున్నది. ప్రజ్ఞవిషయమున ఆయనతో దొరయగల ఆంధ్రులు మిక్కిలి తక్కువగానున్నారు.

మధ్యాహ్నం ముద్దు

[చేసుకున్న పెళ్లాం : చేసుకోతలచిన పెళ్లాం]

రచయిత:

తోలేటి గంగాధరము, ఎం. ఏ.

[గతసంచికకు తరువాయి.]

లూసీ నాకౌగిలితప్పించుకుని తొలగిపోయి కొంచెందూరంగా కూర్చుంది. గద్గదస్వరంతో ఇట్లా చెప్పింది: 'రెండేళ్లుగ అజ్ఞాతవాసం చేస్తున్నాను. ఏడాదినుంచి ఇప్పుడో ఇఖనో నన్ను పెళ్ళిచేసుకుంటావని చూస్తూవున్నాను. నేనుఎప్పుడూ నిన్ను శంకించలేదు. కాని ఇప్పుడు మనబిడ్డకు పేరులేకుండావుండే నైచ్యస్థితికి నేను ఒడబడజాలను.'

ఆమెదైన్యమునకు నాహృదయము లక్కలాగు కరిగిపోయింది. ఆమెను నాచేతులలోనికి తీసుకుంటూ 'నాన్నకు కొంచెం ఆరోగ్యం కుదుటపడ్డంతోటే నాభార్యతో విడాకు పుచ్చుకుని నిన్ను వివాహంచేసుకోవడానికి ఒట్టుపెట్టుకుంటున్నాను' అని నమ్మపలికాను.

ఒకవిధంగా లూసీ తృప్తిపడ్డది. కాని బిడ్డకు పేరుఉండదే అనేభయంచేత కుంచింపబడ్డదని నాకు తెలుసు. నేను సిటికిపందను. స్వార్థపరుణ్ణి. ఆమెను ఎంతగాఢంగా ప్రేమిస్తున్నానో లోకాభిప్రాయానికి అంతగాఢంగా భయపడుతున్నాను. కాబట్టే మానాన్న ఆరోగ్యం సాకుగాపెట్టి వివాహానికి వాయిదా వెయ్యడానికి నేను ఎంతమాత్రం సందేహించలేదు.

మాకు ఇద్దరికీమాత్రం చాలా బెంగగా వుంది. గర్భవతిఅయిన ఆమె ఇంక మద్రాసులోగాని ఈప్రాంతాల్నికాని ఉండడం మంచిపనికాదని మాకు తోచింది. ఆలోచించి ఆలోచించి ఆమెను బెంగుళూరు పంపిద్దామని నిశ్చయించాను. పురుడు వెళ్ళిపోయేవరకు ఆమె బెంగుళూరులోనే వుండవలసి వుంటుంది. తరువాతి ఏర్పాట్లన్నీ తరవాతనే చేసుకోవచ్చు. నాహృదయంలో కొంత కృత్రిమభావంకూడా బయలుదేరింది. నాభార్యకు విడాకుయిచ్చి వదిలించుకుని లూసీని నేను వివాహంచేసుకోలేని కల్పంలో లూసీకి కలగబొయ్యే బిడ్డను ఎవరికేనా పెంపకాని ఇచ్చివేద్దామనే తలంపు నాకు కలిగింది. ఆభావాన్ని అప్పుడు నాలోనే జీర్ణించుకున్నాను కాని లూసీతో చూచాయగా నన్నా అనలేదు. నామనస్సులో పుట్టిన ఈ పాడుబుద్ధికి నాలో నేనే చాలా అసహ్యించుకున్నాను. ఆవిషయం ఇల్లా వ్రాయడానికిన్నీ నాకు చాలా అసహ్యంగానేవుంది. కాని ఏమి చెయ్యను ? విడాకుఇచ్చి అప్రతిష్ఠపాలు అవడానికి నాకు చాలాజంకుగా వున్నమాటనిజం.

లూసీ బెంగుళూరులో కొత్తపేరు పెట్టుకోవడానికిన్నీ, ఎవరేనా ఆమెను ఆమెభర్తను గూర్చి అడిగితే దానికి ఆమె తనభర్త ఒక కంపెనీకి ట్రావెలింగు ఏజెంటుఅనీ, అప్పుడప్పుడుమాత్రం వస్తూవుంటాడనీ చెప్పడాని

కిన్నీ కూడబలుక్కున్నాము.

నెలరోజులకు ఆమె బెంగుళూరు వెళ్ళిపోయింది. అక్కడ ఆమె ఒంటరిజీవితం గడపవలసి వుంటుందని నాకు తెలుసు. అయినా ఎవరితోటీ స్నేహంచేయవద్దనీ సాధ్యమైనంత వరకు గుట్టుగా వుండవలసిందనీ చెప్పేను. రోజూ వుత్తరంవ్రాస్తూవుండడానికిన్నీ, అవకాశం కలిగినప్పుడల్లా తప్పకుండా వెళ్ళి ఆమెను కలుసుకుంటూ వుండడానికిన్నీ వాగ్దానం చేశాను.

ఆవాగ్దానంప్రకారం పురుడు వచ్చేలోపుగ నేను చాలాసార్లు బెంగుళూరువెళ్ళి ఆమెను చూస్తూవుండేవాడిని. ఆమెను కలుసుకున్నప్పుడల్లా ఆమె నన్ను విడాకుల విషయమై ప్రశ్నిస్తూవుండేది. ఆవిషయమైన కార్యకలాపానికి ప్రారంభించానో లేదో అని చాలా ఆతురతగా అడుగుతూవుండేది. ప్రతిసారిన్నీ నేను ఏదో బొంకుబొంకి కాలహరణం చేస్తూవుండేవాడిని. నేను ఎల్లాంటి వంక పెట్టినా పాపం ఆమె నిజమేఅని నమ్మేది. నామాటల్లో ఆమెకు అంతటి విశ్వాసం వుండేది. నామీద ఆమెకు అంత నిష్కళంకమైన ప్రేమవుండేది.

ఇది ఇల్లావుంటూవుండగా మద్రాసులో మావాళ్లు. మానాన్న, మాచెల్లెలు, నాస్నేహితులు నాకూ లూసీకి సంబంధం పూర్తిగా తెగిపోయిందని విశ్వసించారు. నేను ఇప్పుడు సాయంత్రంపూటేనా ఇల్లుకదలి బయటికి పోవటంలేదు. కోర్టుపనేమో, నేనేమో! నేను ఎప్పుడుగాని లూసీతో తిరుగుతూవుండడం చూడ్డానికి ఆమె ఊళ్లోనే లేదాయెను. ఇక నా బెంగుళూరు ప్రయాణాలు. అవి వృత్తిధర్మంలోచేసే బిజినెస్ప్రయాణాలుగా చెలామణీ అయ్యేవి. ఇట్లు రహస్యరక్షణం జరుగుతూ వున్నా నామనస్సుకుమాత్రం ఏమీ శాంతి అన్నది వుండేదికాదు. లూసీ భావినిగురించి దీర్ఘచింతగా వుండేది. అనుక్షణమూ ఆమెను ప్రేమిస్తూనేవుండేవాడిని. కాని నాభార్యకు విడాకుయిచ్చి బయటపడి బహిరంగంగా లూసీని పెళ్ళాడ్డానికిమాత్రం ధైర్యంచాలేదికాను.

లూసీకి పెద్ద పెద్ద ఉత్తరాలువ్రాసేవాడిని. ఆమెకు ధైర్యం, ఉత్సాహంకలిగే వాక్యాలతో ఆవుత్తరాల్నినింపేవాడిని. ఆవుత్తరాలు లూసీకి పెట్టిన మారుపేరుకు వ్రాసేవాడిని. వాటిని నేనే స్వయంగా పోస్టు చేసేవాడిని. ఈ దేవుళ్లాట అంతా, ఈకప్పెట్టుకోవడం అంతా లోకందృష్టిలో నేను సద్వర్తనుడేను అని అనిపించుకోడానికే.

ఒకనాడు బెంగుళూరులోని మెటర్నిటీ ఆసుపత్రినుంచి ఒక టెలిగ్రాము వచ్చింది. లూసీ మారుపేరుతో యిచ్చిన టెలిగ్రాం అది. ఆమెకు కొడుకుపుట్టేడనే వర్తమానాన్ని ఆటెలిగ్రాం దిగుమతిచేసింది. కొద్దిరోజులకు తరువాత లూసీ స్వదస్తూరీతో వ్రాసిన ప్రేమపూర్వకమైన పెద్ద వుత్తరం వచ్చింది. తానూ, బిడ్డా కులాసాగా వున్నామనీ; కుర్రాడు అన్నిరూపులా నాపోలికే ననిన్నీ వ్రాసింది.

'కుర్రాడు ముద్దులు కులుకుతూవున్నాడు. మొగంమీద కళ, కాంతులు వుట్టిపడుతూ వున్నాయి. కాని నిస్సహాయస్థితిలోవున్నాడు. వీడికి తండ్రివైన నీవు ఆసంగతికి సంఘంలో ఆధారం కలిపించకపోతే వీడు సంఘంలో కులటాపుత్రుడుగా చెలామణీ కావలసి వస్తుంది. నన్ను తప్పకుండా వివాహం చేసుకుంటానని నువ్వు ఎన్నోసారులు వాగ్దానం చేసివున్నావు. ఇంక ఏమాత్రమూ ఆలస్యం

చేయవద్దు. వెంటనే సంగతులన్నీ నీభార్యతో చెప్పేసి విడాకుయిచ్చి నీమాట నిలుపుకో' అనికూడా ఆ ఉత్తరంలో వ్రాసింది.

మానాన్న అనారోగ్యము మొదలయిన కారణాలతో ఇంతవరకు కాలహరణంచేస్తూ వచ్చేను. ఇల్లావుండగా ఈమధ్య మానాన్న కాలంచేశాడు. ఇంక మానాన్న అనారోగ్యం మీద సాకుపెట్టడానికి ఏమీవీలులేదు. లూసీపై నాకుగల ప్రేమనూ, గౌరవాన్నీ నిలుపుకోవాలంటే వెంటనే నావాగ్దానం చెల్లించుకోక తీరదు.

కాబట్టి నాభార్యకు విడాకు యిచ్చివేయడానికి నేను ధైర్యంతెచ్చుకుంటూ లూసీని ఒకసారి చూచిరావడానికి ప్రయాణమయ్యాను. ఇప్పటికి పురుడువచ్చి నెలరోజులయింది. కుర్రాణ్ణిచూద్దామన్న కుతూహలంకూడా నాలో అగ్గలమయి వుంది.

లూసీ ఆరోగ్యంగానేవుంది. పిల్లవాడిని గురించి ఆమె చాలాగర్వంగానూ, ఉత్సాహంగాను వుంది. కడుపునపుట్టిన కొడుకు చిన్నారి మొగాన్నిచూచి ఆమొగంమీద నాపోలికలు చూడడంతోటే కలిగే ఆనందం ఎట్టిదో నేనింతవరకూ ఎరగను. నాచేతులలో ఆచంటి వాడిచేతులు పట్టుకోగా వాడు తనచిన్నారి వేళ్ళతో నావేళ్ళను పిడికిలి పట్టేడు. అప్పుడు అనుకున్నాను: లూసీకోరిక చెల్లతగిందేనని-లూసీ నేనూ భార్యాభర్తలమై ఆపిల్లవానిని చర్చికితీసుకుపోయి నామకరణంచేయాలని.

'లూసీ' దైవసాక్షిగ నీవు నాభార్యవు.చట్టము సమ్మతించేటంత శీఘ్రకాలంలో నిన్ను నా భార్యగాచేసుకుంటాను. నీవు త్రికరణశుద్ధిగా నమ్మవలసింది.' అని వాగ్దానం చేశాను.

మద్రాసువంటి మహాపట్టణంలో అతిలోక ప్రఖ్యాతీ, అచటివకీళ్లను అందరినీ తలదన్ని వృత్తివిషయంలో గొప్పపేరూ- సంపాదించాలనే తీవ్రకాంక్ష లూసీని పెళ్లాడి ఆబాలుడికి చర్చిలో పేరుపెట్టే ఆనందంముందు దిగదుడుపుగా కనిపించింది. వెనకటిలాగే ఈసారి కూడా లూసీ నన్ను, నామాటల్ని నమ్మింది. ఆదఫా అచట రెండురోజులు వున్నాను. ఆ రెండురోజులు మేము ఆనందమయస్వర్గంలో వున్నాము.

ఆసుపత్రిలో లూసీకి పరిచర్యచేసిన నర్సు అపుడపుడు వస్తూవుండేది. ఆమె నన్ను లూసీ భర్తగా సంబోధించేది. నాకు అప్పుడు వల్లమాలిన సిగ్గుగావుండేది. కాని ఆసిగ్గు పైకి కనిపించకుండా విశ్వప్రయత్నం చేశేవాడిని.

తిరుగుప్రయాణంలో రైల్లోవున్నంతసేపు లూసీయే నాభార్యఅయినట్టుగా భావికార్యక్రమం ఆలోచించాను. ఇంటికివెళ్లడంతోటే ఏమాత్రం ఆలస్యంచేయకుండా నాభార్యతో సంగతిసందర్భాలన్నీ మాట్లాడి విడాకు పుచ్చుకోవాలి అని అనుకున్నాను. కాని విడాకు విషయంలో లోకంలో పుట్టే వాడుకలకు నాగుండె పీచుపీచు మనకుండా వుండలేదు.

మరునాడు ఉదయాన్ని మదరాసులో కాలుపెట్టేను. మానాన్న పాతస్నేహితుడు జోసెఫ్ రైలు ప్లాటుఫారముమీద నన్ను కలుసుకున్నాడు. జోసెఫ్ ఒక గొప్ప రాజకీయ నాయకుడు. అతడు గతసారి మదరాసు మంత్రాంగంపర్వాటులో పాల్గొన్నాడు కూడాను. రైలుదగ్గరే మొదలుపెట్టాడు: నేను మదరాసు ఎన్నికల్లో పాల్గొనాలనీ, మదరాసు శాసనసభకు మదరాసు పట్టణ నియోజకవర్గానికి నేను ఒక అభ్యర్థిగా నిలబడాలనీ, నిలబడ్డట్టుఅయితే తానూ తన పార్టీవారు తప్పక నాకు సాయంచేస్తామనీ

చెప్పినాడు.

'నీవు తప్పకుండా నెగ్గుతావు. మంచి ప్రాక్టీసువున్న మద్రాసు ప్లీడర్లలో నువ్వు ఒకడవు. మాపార్టీకి నీవంటి ప్రఖ్యాతిగల యువకుడు కావాలి. రాజకీయరంగంలో నీకు ప్రకాశమానమైన భవిష్యత్తు వుందని నాకు తోస్తుంది. నీవు జాగ్రత్తగా వ్యవహరిస్తూ రాజకీయరంగాన్ని వదిలిపెట్టకుండా వుంటేటట్లు అయితే నీవు ఒకనాడు ఈరాష్ట్రానికి ప్రధానమంత్రివి అయితీరుతావని నానమ్మకం.' అని కూడా అన్నాడు.

నేను పరవశుణ్ణి అయినాను. ఆనందగర్వములతో ఉబ్బి తబ్బిబ్బు ధోరణిలోకి దిగాను. జోసెఫ్ తిరిగి చెప్పినాడు.

'ఈఎన్నికలో నీకు చాలామంది ప్రత్యర్థులుంటారని నేను వేరే చెప్పనక్కరలేదు. నీయందు లోపం చూపడానికి ఎదిరిపార్టీ వారికి ఏమాత్రమూ అవకాశం చిక్కనియ్యకూడదు. కాబట్టి నీ విషయంలో నాకుగల ఒక అనుమానాన్ని నివృత్తిచేసుకోవలసివుంది. కొంత కాలంక్రితం నీవద్ద టైపిస్టుగావున్న స్త్రీతో నీకు ఏదో అనుచితమైన సంబంధం వుండేదని ఒక పుకారు బయలుదేరింది. నీభార్యకు విడాకులిచ్చి ఆటైపిస్టును పెళ్లాడతలచేవనీ, ఆసంగతి విన్నతరవాతనే మీనాన్నకు ఆరోగ్యం పూర్తిగా చెడిపోయిందనీ మొదలయిన మాటలు నిన్నుగురించి విన్నాను. కాని నిన్ను గూర్చిన ఆమాటలు అసత్యాలనీ, నీభార్యతో నీవు ఖోక్తుగావున్నావనీ ఇప్పుడు నమ్ముతున్నాను.'

'నిజమే! లోకులు కాకుల్లాంటివారు. నేను, ఆటైపిస్టు కాస్తస్నేహంగా వుండడంచూచి లోకులు లేనిపోని అపోహలుపడి అనరాని మాటలు అన్నారు.' అని నేను పచ్చిఅబద్ధం ఆడాను. కీర్తి వాంఛతో నాతల తిరిగిపోతూ వుంది.

'నీవుచెప్పినసంగతులు నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఇకముందుకూడా నీప్రవర్తన నిష్కళంకమైఉండాలి. ఎలక్షన్ రంగంలో దిగడంతోటే నీవుచేసే ప్రతిపనీ, నీవుఆడే ప్రతిమాటా నీప్రత్యర్థుల విమర్శనకు గురిఅవుతూ వుంటుందనిమాత్రం మరిచిపోకు. నేను మళ్లీ వచ్చి నిన్ను కలుసుకుంటాను.' అని చెబుతూ కరస్పర్శచేసి ఆయనవెళ్లిపోయాడు.

భావిరాజకీయరంగంలో నాకు కలగబోయ్యే స్థానమునుగూర్చి సుఖమయకల్పనలు కూర్చుకుంటూ నేను స్టేషన్నుండి ఇంటికి వచ్చేను. ఎన్నికల్లో నాకు జయంకలిగితే .. రాజకీయరంగంలో నేను ఒకఉన్నతస్థానం ఆక్రమిస్తానేమో! భావికాలంలో నాకు అనంత గౌరవమూ, అమితకీర్తీకలగబోతున్నవేమో!

ఇంతలో నేను బెంగుళూరులో లూసీకిచేసిఉన్న వాగ్దానం జ్ఞాపకానికివచ్చింది. నిలువునా కూలిపోయాను. నేను ఆమెను పెళ్లాడ తలచేవున్నాను. కాని రాజకీయరంగంలో నాకు గలగబోయే అభివృద్ధికూడా ఆమెలా భంగొరకు అయిందేగా! ఎన్నికల్లోనెగ్గి రాజకీయరంగంలో నేను చిరప్రతిష్ఠ,ఉన్నతపదవీ సంపాదించి తరవాత లూసీని పెళ్లాడితేనంటే బాగా వుంటుంది. ఇప్పటంత సులభంగా అప్పుడు నన్ను లోకం దుయ్యబట్టలేదు. ఎన్నికలముందు ఇంట్లోకలహం పెంచుకుని విడాకు వ్యవహారాలతో కూర్చుంటేనంటే ప్రత్యర్థులు దీన్ని అవకాశంగా తీసుకుని నామంచిపేరు చెడగొట్టి ఎన్నికల్లో ఓడిపోయేటట్లు చేస్తారు.

అదీకాక ఈనాడు జరగవలసింది మరి మూడునెలలు అయాక జరుగుతుంది. ఇంతలో మించిపోయేది ఏముంది.? ఈనాడు

జరిగే పెళ్లి ఎలక్షన్లు అయాక జరుగుతుంది. ఇంతలో ఎందుకు తొందరపడడం?

ఈమాదిరి ఆలోచనాపరంపరలతో లూసీని పెళ్లాడాలనే నాదీక్ష కొంత సడలింది. నాభార్యతో ప్రస్తుతం విడాకులప్రస్తావన తేకుండా వుండడానికే నిశ్చయించేను. తెస్తినో ఆమె సాధారణమైందికాదు. లూసీవిషయంలోనూ, నావిషయంలోనూ ఉన్న అనుమానాలన్నీ కోర్టుకు ఈడుస్తుంది. ఆమె నాకు విడాకులిచ్చేలోగా కోర్టులో నానాఅభాసుచేసి నాకీర్తి పూర్తిగా నాశనంచేస్తుంది. కాబట్టి ప్రస్తుతంలో విడాకుల ప్రస్తావన కట్టిపెట్టేయడమే వుత్తమంగా నాకు కనిపించింది.

లూసీకి ఒకపెద్ద ఉత్తరంవ్రాశాను. నాప్రేమఅంతా అందులో ముద్దచేసి పెట్టేను. నాకు ఆమెయందుగల విశ్వాసాన్నంతా అందులో చూపించాను. నేను ఎలక్షన్లలో పాల్గొంటూవున్నాననీ, అవి తీరిపోయే పర్యంతమూ విడాకు ప్రస్తావన కదపదలుచుకోలేదనీ వ్రాశాను.

'ప్రియురాలా! నాయీకష్టమంతా నీకొరకే అనినమ్ము. ఏమంటావా? నాజయం నీజయంలాగే నీవు సంతోషిస్తావని నాకు తెలుసు. మరోసంగతి. ఎలక్షన్లు తీరేవరకూ నేను బెంగుళూరు రాను. వచ్చినా నిన్ను కలుసుకోను. ఎవళ్ళైనా చూస్తే అప్రతిష్ఠపాలవుతాము. అప్రతిష్ఠేకాదు ఎన్నికల్లో అపజయంకూడా కలుగుతుంది. నాహృదయం నువ్వు ఆకళించావనే నమ్ముతున్నాను. ఇదివరకులాగే ఇప్పుడుకూడా నీవు నాయందు పూర్తివిశ్వాసం వుంచవలసిందిగా ప్రార్థిస్తున్నాను.' ఈమాదిరిగా ఆమెకు వుత్తరంవ్రాసి పోస్టుచేశాను.

మంచిమాటలుచెప్పి లూసీని మభ్యపెట్టడానికి ప్రయత్నించాను. ఆమెకు ద్రోహంచేస్తున్నానని నన్ను అస్తమానూ లోపలనుంచి పొడుస్తూవున్న అంతరాత్మకు నాజయం ఆమెకుకూడా జయమేననీ, ఎన్నికల్లో గెలుపు ఉభయత్రా లాభప్రదమైందనీ సమాధానం చెప్పుకుంటూ వస్తున్నాను. నాస్వార్థం నన్నే కొట్టేరోజు ఒకటి వస్తోంది అనే విషయాన్ని మాత్రం కానలేకపోయాను.

ఎన్నికలప్రయత్నంలో వున్నాను. జోసెఫ్ తఱుచు వస్తూవుండేవాడు. క్లబ్బులికి, మీటింగులికి నాభార్యనుకూడా తీసుకువస్తూవుండవలసిందనీ, అట్లా తీసుకురావడంవల్ల ప్రజల్లో నన్నుగూర్చి లోగడవుండిన పుకారు సమసిపోతుందనీ అతను చెప్పేడు. నేను అట్లాగే చేశేవాడిని. మనస్సులో ఎంత ఇష్టం లేకపోయినా నాభార్యను రోజూ వెంటవేసుకు తిరిగేవాడిని. నాలోని ఈమార్పుకు నాభార్య చాలా ఆనందించేది. 'విడాకునుగూర్చి నీ అభిప్రాయం మార్చుకున్నందుకు నాకు నిండా సంతోషంగావుంది. నీభావిజీవితం ప్రకాశమానంగా వుండాలని నాహృదయపూర్వకమైన కాంక్ష. రాజకీయరంగంలో నీకు ఉన్నతపదవీ, అనంతగౌరవమూ కలగాలని కోరుతూవున్నాను' అని ఆమె అంది.

నాభార్యచెప్పిన ఈమాటలకు నాకుఏమీ సంతోషంకలగలేదు. కాని నేను ఏమీ మాట్లాడలేదు. నేను వట్టి పిరికిదద్దమ్మనని నాలో నేనే తిట్టుకున్నాను. ఆమె ఇట్లా చెపుతూవుండిన సమయంలోనే నేను విడాకుకోరిఉన్నట్లయితే ఎంతబాగుండేది? కాని ఆసమయంలో విడాకుకోరడానికి నాకు ధాతువులు లేకపోయినాయి.

బెంగుళూరునుంచి లూసీ నావుత్తరానికి జబాబు వ్రాసింది. చాలా ముక్తసరిగా వ్రా

సింది. ఆమెకు చాలా కోపంవచ్చిందని నేను తెలుసుకోగలిగాను. కాని తనహక్కును తాను పొందడానికికూడా ఆమె నోరుచేసుకు అడగడానికి బిడియపడింది ఆమె ప్రేమ అంతటి స్వార్థరహితమైంది! దరిమిలాను ఆమె వద్దనుంచి వచ్చిన ప్రతిపుత్తరంలోని ప్రతి అక్షరమూ విషాదచ్ఛాయలనే సూచిస్తూవుండేది. ఒకవిధమైన ముభావంకూడా ఆ ఉత్తరాల్లో పెరుగుతూవచ్చింది.

బెంగుళూరులో ఆమె కాపరంపెట్టినప్పటి నుంచీ నెలనెలకూ ఆమె మారుపేరుకు డబ్బు పంపుతూవుండేవాడిని. ఇటీవల నేనుపంపిన డబ్బునుమాత్రం ఆమె వాపసుపంపేసింది. వాపసుపంపుతూ ఆమె ఒక ఉత్తరంకూడా వ్రాసింది.

'ఇప్పుడు నేను ఒక ఉద్యోగంలో కుదిరివున్నాను. మనకుర్రాణ్ణి పెంచడానికి ఒకమనిషిని కుదిర్చాను. నా ఉద్యోగంవల్లవచ్చే జీతంతో నేనూ, కుర్రాడూ, పనిమనిషీ కూడా సుఖంగాను ధారాళంగాను బ్రతకడానికి అవకాశంవుంది. ప్రస్తుతంలో నీకు డబ్బు చాలా అవసరం. ఎన్నికల్లో డబ్బు నీళ్ల ప్రాయంగా వెచ్చింపవలసివుంటుంది. నా వాంఛలు అంతటి ధనవ్యయాన్ని కోరేవికావు. నీవు ఇదివరకు పంపుతూవచ్చిన డబ్బులోకూడా నెలనెలకూ కొంతమిగులుస్తూనేవచ్చాను. ఆడబ్బునుకూడా నీకు తిరిగి పంపుతూవున్నాను. నీ ఎలక్షనులకు దానిని వినియోగించుకోవలసింది. ఇకముందుకూడా నీవు నాకు ఏమీ డబ్బుపంపవద్దు. నీవు నాకిల్లా డబ్బుపంపుతూవున్నట్లు ఖర్మంచాలక తెలిసిపోతే చాలా కష్టమౌతుంది. నామూలంగా నీకు కష్టం కలగడం నాతలంపుకాదు.' అని ఆమె వ్రాసింది.

ఇంత ఉత్తరంలోను పెళ్ళినిగూర్చి ఒక వాక్యమైనా, తుదకు ఒక సూచనఅయినా లేదు. ఆమెకు మనస్సులో చాలా కష్టంగా వుందనినాకు తెలుసు. కాని ఆమెది చలింపని ప్రేమఅనీ,దానివిషయమై ఎట్టి అపాయశంకగాని పెట్టుకోడానికి అవకాశంలేదనీ నా నమ్మకం.

ఒకసారి ఆమె మరోవుత్తరంవ్రాసింది. అందులో కుర్రాడు ఎల్లాపెరుగుతూవున్నదీ, తాను ఆతన్ని ఎంతగాఢంగా ప్రేమిస్తూవున్నదీ వివరించింది. 'నీప్రేమకు నేను లొంగకుండా వుండివుంటే చాలా బాగుండివుండునని నాకు అప్పుడప్పుడు తోస్తూవుంటుంది. నేను మొదటినుంచీ కొంచెంస్వార్థంతో ప్రవర్తిస్తూవుండవలసింది. ఏమైతే ఏమి? జరగవలసిందేమో జరిగిపోయింది. ఒకప్పుడు పిల్లాడికోసమే గా నన్ను పెళ్లాడవలసిందని నిన్ను నిర్బంధించివున్నాను. ఇప్పుడు ఆ పిల్లాడికోసం కూడా నన్ను పెళ్లాడమని నిన్ను కోరను. ఈ పెళ్ళిమూలంగా నీభావిని పాడుచేసుకోమని నిన్ను ఏమాత్రమూ నేను కోరను.' అని కూడా ఆమె వ్రాసింది.

ఉత్తరం ఈధోరణిలోవుంది. చాలా దయనీయంగానేవుంది. కాని ఆమె ఆత్మగౌరవాన్ని తగ్గింపజేసే వాక్యం ఒకటికూడా అందులో లేదు. ప్రతీవాక్యమూ ఆమె హృదయావేదన్ని అణచిపెడుతూన్నట్లుమాత్రం స్పష్టం చేస్తూవుంది.

రోజులు గడిచిపోతున్నాయి. ఎలక్షన్ హడావిడితో నాకు ఊపిరి పీల్చుకోటానికేనా తీరుబడి లేకుండావుంది. నా ఆలోచనా, కాలమూ యావత్తూ ఎలక్షన్ గొడవలతో నిండిపోయింది. ఎన్నికలప్రచారం తీవ్రంగా సాగుతూవుంది. అందరూ నేను నెగ్గితీరుతానని

అంటూవున్నారు.

ఇంక ఎన్నికలు రెండువారాలు మాత్రం వున్నాయి. ఒకనాడు లూసీవద్దనుంచి జాబు వచ్చింది. ఆవుత్తరంతో నాపని తలక్రిందులై నట్లు అయింది.

ఆమె వుత్తరం ప్రేమపూర్వకంగానే వ్రాసింది. కాని దానిలోని ప్రతి వాక్యమూ ఆమె నిశ్చితభావాన్ని ప్రస్ఫుటంచేస్తూంది. 'నేను నిన్ను గాఢంగానే ప్రేమిస్తున్నాను. ఎప్పటికీ అట్లానే ప్రేమిస్తాను. అయినా ఇక మన ఇద్దరికీ పెళ్లిమాత్రం కాదని నాకు గట్టిగా తోస్తూవుంది. నేను బాగా ఆలోచించాను. నీ ప్రఖ్యాతి దినదినాభివృద్ధి అందుతుంది. రాజకీయరంగంలో నీకు క్రమాభివృద్ధికలుగుతుంది. ఎప్పటికయినా నాతో వివాహం నీకు ప్రతిష్ఠాభంగకరంగా వుండకమానదు. నీప్రతిష్ఠకు భంగకరంగానూ, నీ అభివృద్ధికి అడ్డంకిగానూ వుండడం నాతాత్పర్యంకాదు. మన ఈ కుర్రాడికోసమయినా నీభావిఅభివృద్ధి పాడుచేసుకోవడం నాతలంపుకాదు. నీయందునాకు గల ప్రేమ అట్లాంటిది. నామూలంగా నీకు ఏమాత్రం నష్టంకలగడం నాకు ఇష్టంలేదు. కాని ఇప్పటి నాఒంటరిజీవితం చాలా దుర్భరంగా వుంది. కాపరంకూడా రహస్యంగానే జరుగుతూవుంది. ధారాళంగా స్నేహితులతో మెలగడానికిగాని, కొత్తవారితో స్నేహం చేయడానికిగాని వీలులేకుండా వుంది. నేను ఎంతకాలం ఇల్లా ఒదిగివుండగలను? నేనూ, నాపిల్లాడూ అందరిలాగా స్వేచ్ఛగా వుండగల ఇల్లు కావలసివుంది. ఇతరపిల్లల్లాగే నాపిల్లాడుకూడా పెంచబడ్డం నాకు కావాలి. నేను ఒకచోట ఉద్యోగానికి కుదిరి ఉన్నానని ఈవరకే వ్రాసివున్నాను. నాయజమాని చాలామంచివాడు. నలభై యేళ్ళవాడు. ఉదారాశయాలు, ఉన్నతాశయాలు గలవాడు. అతడు ఇంకా పెళ్ళిచేసికోలేదు. ఆతనిపేరు హంటర్. అతను నాకథఅంతా విన్నాడు. నన్ను వివాహంచేసుకోడానికి చాలా కుతూహలపడుతూ వున్నాడు. అతను పిల్లవాణ్ణి తనపిల్లవాణ్ణిగా చూసుకోవడానికిన్నీ, చర్చిలో పిల్లవాడికి తనపేరు ఇవ్వడానికిన్నీ అంగీకరించినాడు. నేను సుఖంగాజీవిస్తూవున్నానని తెలుసుకోవడానికి నీవు చాలా ఆనందంపొందుతావని అనుకుంటాను. ఇతర పిల్లలకులాగే నాపిల్లాడికికూడా ఇంటిసుఖమూ, తండ్రిసుఖమూ కలుగుతాయి. నీకు దేవుడు ఎల్లప్పుడూ సహాయంచేస్తూ నిన్ను మంచిఅభివృద్ధిలోకి తేవాలని ప్రార్థిస్తూవున్నాను. పరిస్థితులన్నీ నీకు మర్మంవిడిచి వ్రాశాను. నా అంతర్యంగ్రహించి నావివాహానికి నీ అంగీకారాన్ని వెంటనే తెలుపుతావని నమ్ముతూ వున్నాను' అని ఆమె ఉత్తరాన్ని ముగించింది.

ఉత్తరం చదవడం ముగించేసరికి నాకు మెరుపుదెబ్బ తగిలినట్లు అయింది. ధాతువులు స్వాస్థ్యాన్ని తప్పిపోయాయి. లూసీ నన్ను విడిచి- నన్నుకాదని ఇంకోపురుషుణ్ణి వివాహం చేసుకోతలచిందనేవార్త! నాకు పట్టరానంత కోపంవచ్చింది. భరింపరానంతటి అసూయ. అసూయ, కోపం నన్ను మింగేశాయి. కాని కొంచెంసేపటికి తెప్పరిల్లాను. ఎలక్షను పోయినాసరే, ఏమిపోయినాసరే లూసీనిమాత్రం పోగొట్టుకోకూడదని నిశ్చయించాను. లూసీ యిట్టి తలపుకు ఎల్లా అవకాశంయిచ్చిందా అని నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

వెంటనే లూసీకి ఉత్తరం వ్రాద్దామని ప్రారంభించాను. ఆరుసార్లు వ్రాసి ఆరుసార్లు

చింపేశాను. వెంటనే వెళ్ళి ఆమెను చూడకపోతే నాకు పిచ్చిఎత్తేటట్లువుంది. కాబట్టి ఎలక్షన్ పనులన్నింటినీ ఎక్కడివి అక్కడ వదిలేసి బెంగుళూరు ప్రయాణమయ్యాను.

లూసీ కాపరంవున్న యింటికి చేరాను. పిల్లవాడిని ఎత్తుకుని పనిమనిషి ఎదురైంది. కుర్రాణ్ణి చూడ్డంతోటే నాహృదయం ఆనందంతో ఉత్తరంగితమైంది. ఇప్పుడు వాడికి ఐదోనెల. బాగా వొళ్లుచేసి చాలా నవకంగానూ, కోమలంగానూ వున్నాడు.

లూసీ పనిచేస్తూవున్న ఆఫీసుకు ఫోను చేశాను. నాఫోను అందడంతోటే ఆమె ఇంటికివచ్చి వాలింది. అది ఎంతటి మహత్తరమైన సమావేశము! నన్ను చూడ్డంతోటే ఆమెకళ్ళవెంట అప్రయత్నంగా నీటి బిందువులు జాలువారాయి. నేను ఆమెను ఆలింగనంచేసుకోగా ఆమె నా మెడకు చుట్టుకుంది. నేను ఆమె పెదవులమీదా, తలవెంట్రుకలమీదా ముద్దులవర్షం కురిపించాను. ముద్దుల విషయంలో నాకుకలిగిన ఆకలి ఎన్నిముద్దులతోనైనా తీరేటట్లు కనిపించలేదు. నన్ను కాదని మరొకణ్ణి వివాహమాడ్డానికి నిశ్చయించుకొన్నందుకుగాను ఆమెతో చాలా నిష్ఠూరంగా మాట్లాడాను.

'ఇక ఎప్పటికిగాని అతణ్ణి పెళ్లాడనని వాగ్దానంచెయ్యి. నిన్నూ, ఈకుర్రాడినీ వదిలిపెట్టవలసివచ్చే కల్పంలో ఎలక్షన్ లేకాదు ఏమైనాసరే వదిలేస్తాను.' అని నమ్మబలికాను. నానోటివెంట మాటరావడం తడువుగా ఆమె నాకోరికప్రకారం చేయడానికి అంగీకరించింది. ఎలక్షన్లు అయేవరకూ మాత్రం వివాహం ఆపివుంచవలసిందని ఆమె కోరింది.

నేను అక్కడే భోజనంచేశాను. లూసీ నాసహపంక్తిని కూర్చుని అన్నంతింది. పనిమనిషి వడ్డనచేసింది.

'నాకోరికఅల్లా యింతే. మనయిద్దరం భార్యాభర్తలమై ఈ కుర్రాణ్ణి పెట్టుకుని ఒక యింటిలో కాపరంచేయడం. ఇది ఒక్కటే నాకోరిక' అని లూసీ నెమ్మదిగాఅంది. ఆ సమయంలో ఆమెకళ్లల్లోనీళ్లు గిర్రునతిరిగి వున్నాయి.

'నీకోరిక నెరవేరేకాలం దగ్గిరపడింది' అని నేను అన్నాను. నాహృదయంలోకూడా ఈసారి వెంటనే వివాహంచేసుకోవాలనే సంకల్పమే నిశ్చయంగా కలిగింది.

సాయంకాలంవరకూ కూర్చుని మాభావినిగూర్చి ఆలోచిస్తూనే వున్నాము. ఏవిషయంలోకాని బెంగపెట్టుకోవద్దని గట్టిగా చెప్పేను. మేము ఇద్దరంఏకమై ఎంతటికష్టనిష్ఠురాల్నికాని ఓర్చగలమని ధైర్యం చెప్పేను. ఎలక్షన్లు తీరినవెంటనే సంగతి సందర్భాలన్నీ నాభార్యకుచెప్పేసి విడాకుఏర్పాటు చేయడానికి నిశ్చయించానని నామనస్సులో వున్న యదార్థమైన సంకల్పాన్ని ఆమెకు చెప్పేశాను.

సాయంకాలం ఫలహారంచేశాము. సినీమాకు వెళదాంరమ్మనమని లూసీని చాలా బలవంతంచేశాను. నామాట తీశెయ్యలేక ఆమె చివరకు అంగీకరించింది. మేము బయలుదేరి బయటకువచ్చేము. మద్రాసులో ఎలక్షన్లలో నాకు ప్రత్యర్థులుగా నిలిచిన ఐదుగురిలోనూ ఒకడైన రామనాథంచెట్టి ఆ రోడ్డుమీద అప్పుడు నాకు ఎదురయ్యాడు. అతను బెంగుళూరు అప్పుడు ఏమిపనిమీద వచ్చేడో నాకు తెలియదు. మేము ఇద్దరమూ మాట్లాడుకున్నాము. అతను చాలా మర్యాదగా మాట్లాడినాడు. అతనివద్ద సెలవు తీసు

కుని నేనూ, లూసీ పోయిన చాలాసేపటివరకూ అతను అక్కడే నిలబడి మాకేసి నిదానించి చూస్తూవుండినాడు.

అతన్ని చూడ్డంతోటే నాముఖకళ కొంచెం మారివుండడం లూసీ కనిపెట్టింది. అతని వద్ద సెలవుతీసుకుని మేము కొంచెందూరం బయటికి రాగానే ఆమె అతను ఎవరని నన్ను అడిగింది. నేను ఏమీసమాధానంచెప్పక మాసంభాషణ మరోవిషయంలోకి మార్చి వేశాను.

'కాగలకార్యం కాకమానదు. భయపడి ఏమిలాభం?' అని అనుకుని నేను ఆవిషయాన్ని మనస్సుకు పట్టకుండా చేసుకున్నాను.

మరునాడు ఉదయాన్ని పెందరాలే భోజనం చేసి కుర్రాణ్ణి పనిమనిషికి అప్పగించి లూసీ, నేను బజారుకు బయలుదేరాము. నేను మద్రాసు పోయేలోగా లూసీకీ, పిల్లాడికీ ఏమైనా కొని బహుమానంచేద్దామని సంకల్పించాను. ఆనాటిఉదయం చాలా వుల్లాసంగా వుంది. గాలిపాటు సరిగావుంది. ఆనాటికూడా లూసీ ఆఫీసుకు సెలవుపెట్టింది. ఇదివరకటి కంటె కూడా ఆవేళ లూసీ చాలా అందంగానూ, నాజూకుగానూవుంది. ఆమె వుత్సాహంతో పులకలువేస్తూ ఆనందంతో ఉద్వేలితమౌతూవుంది.

మేము రాజవీధికివచ్చాము. వచ్చేకార్లు, పోయేకార్లు ఎడతెరిపిలేకుండా వున్నాయి. అచట బీటుపోలీసు సవ్యసాచిలా సిగ్నల్సు యిస్తూవున్నాడు. మేము రోడ్డుకు అవతలపక్కకు వెళ్ళవలసివుంది అవకాశంకొరకు చూస్తూ వున్నాము. పక్కనే మాకు కొంచెందూరంలో ఒకదాది, ఆమెచేతుల్ని పట్టుకుని నాలుగైదేళ్ళ కుర్రాడు నిలబడివున్నారు. ఆకుర్రాడు బొద్దుగా అందంగా వున్నాడు. వాణ్ణి నాకు చూపిస్తూ లూసీ 'రెండుమూడేళ్ళల్లో మన కుర్రాడుకూడా అంతబొద్దుగానూ, అంత అందంగానూ తయారు అవుతాడు.' అని చెప్పింది.

కుర్రాడుమాత్రం రోడ్డుదాటి పోడానికి తహతహలాడుతున్నాడు. చీమలబారులా వచ్చిపోతుండే కార్లనుకూడా అతను గమనించినట్లు లేదు. రమ్మని దాదిని ఊరికే లాగుతున్నాడు. ఆదాది ప్రక్కనువున్న మగవాడితో ఏదో సంభాషిస్తూవుంది. ఆసంభాషణలో ఆమె ఇతరం యావత్తూ మరచివుంది. ఈసందర్భంలో ఆకుర్రాడు దాని పట్టు వదుల్చుకుని రోడ్డువెపు పరుగెత్తేడు.

ఇంతలో లూసీ అమ్మయ్యో అంది. ఈ పక్కనుంచి ఓప్లజర్ కారూ, ఆపక్కనుంచి ఒకబస్సూ వస్తూవున్నాయి. కుర్రాడు మృత్యుదేవత క్రూరదంష్ట్రలనడుమను ఉన్నాడు. ఏమి జరుగుతోందో నేనుపోల్చిపట్టేలోపుగ లూసీ చెంగున రోడ్డుమీదకువెళ్లి కుర్రాడు కారుకిందపడకుండా యివతలకు గెంటింది. ఈలోగా బస్సువచ్చి లూసీని పడకొట్టేసింది.

తరువాత జరిగినవిషయాలు జ్ఞాపకంవుండకుండా నాకు మతిస్థిరత తప్పిపోతే బాగుండును అని నేను కోరుతాను. అది అంతటి విషాదగాధ-రెప్పపాటులో జరిగిపోయింది- కూడ తీయడానికి వీలులేనిహాని జరిగింది. అదిజరిగిన ఇన్నాళ్లకు నే నీపంక్తులు వ్రాస్తూండగా కూడా నాకళ్ల వెంట నీళ్లువచ్చి మిగిలిన ప్రపంచాన్ని యావత్తు చీకటికోణంగా చేశివేస్తున్నాయి.

కొద్ది గంటలతరువాత నేను ఆసుపత్రికి పోయినాను డాక్టరు ఎట్టివార్త చెవుతాడో విందామని. స్మృతి తెలియనిస్థితిలో ఆమెను

యాంబులెన్సుమీద ఆ ఆసుపత్రికి తీసుకుని వచ్చేరు. ఆ ఆసుపత్రిలో నావద్దకు ఒకనర్సు వచ్చి నన్ను లోనికి తీసుకుపోయింది. ఆమెతో లోపలికి నడిచిపోతూవుండగా నాశరీరం ఆపాదమస్తకం వణికిపోతూవుండింది.

'ఆమె నీభార్యా?' అని ఆమె అతికరుణంగా అడిగింది.

'అవును. నాభార్యే' అని నేను అన్నాను. పోటుంబాటుగా నాకళ్ళవెంట నీళ్లుకారుతూవున్నాయి. బిగ్గరగా ఏడవాలనీ, ఆమె నాభార్యే అని లోకానికి అందరికీ ఒక్కసారి వినిపించేటట్లుగా అరవాలనీ కోరాను.

మరిరెండు నిమిషాల్లో నేను డాక్టరుగదిని చేరాను. అతను ఏమిచెబుతాడో అని ధాతువులు ధాతువుల్లోలేవు. అయినా ఎల్లాగో చిక్కబట్టుకుని ఉన్నాను. డాక్టరు నెమ్మదిగా చెప్పినాడు: 'పైకి పెద్దదెబ్బలు ఏమీ కనిపించకపోయినా ఆమెలోపలి అవయవాలన్నీ ఛిన్నాభిన్నం అయిపోయినాయి. ఆమె ఇక జీవించదు.'

బోరుమని ఏడవడానికికూడా నాకు ఊపిరి రాలేదు. కడసారి నన్ను లూసీదగ్గరకు తీసుకుపోయినారు. అట్టిస్థితిలో రోగికి వెలుతురు వుండకూడదు కాబట్టి ఆగదిని ప్రయత్నపూర్వకంగా చీకటిగా వుండేటట్టు చేశారు. లూసీకి బాగా తెలివివచ్చింది.నాకోసంకబురు చేశింది కూడాను.

'ప్రియా! నీముఖాన్ని విచారానికి స్థానం చేసుకోవద్దు, నిజానికి నాకు ఏబాధాలేదు. కులాసాగానేవుంది. పడ్డప్పుడు కొంచెం దెబ్బ తగిలివుంటుంది. అంతే. ఇంతకీ ఆకుర్రాడు అపాయంలేకుండా వున్నాడు కదా!' అని ఆమె అడిగింది. మాట్లాడేటప్పుడు ఆమెకు పట్టరాని ఆయాసం వస్తూవుంది.

'ఆకుర్రాడి తలవెంట్రుకేనా కదలలేదు. అతని తల్లిదండ్రులుకూడా వచ్చి క్రింద వున్నారు. నీకు కృతజ్ఞతాపూర్వకవందనాలు అర్పించడానికి ఆతురతపడుతూ వున్నారు. వారు నీకు చెయ్యగలది ఏమైనా వుందేమో తెలుసుకోవడానికి కుతూహలపడుతున్నారు.' అని చెబుతున్నాను.

ఇంతలో నాకంఠం విచారంచేత నొక్కుకు పోయింది. రెండుచేతులతో మొగం మూసుకున్నాను. లూసీ నిట్టూర్పువిడిచింది. తన చేతిని నాతలమీదవేసి నిమిరింది. అప్పుడు గొప్ప ప్రయత్నంమీద తలఎత్తి ఆమెను చూడగలిగేను.

'ప్రియా! నేను చావుకుసిద్ధమై వున్నాను. నే నింకా బ్రతుకుతానని నీవు నన్ను మభ్యపెట్టవద్దు. నాకు తెలుసు నాచావు ఇంకకొద్దిగంటలలో రానున్నదని.నిన్ను, మనకుర్రాణ్ణి వదలివెళ్లడానికి నాకు ఎంతమాత్రముఇష్టం లేదు.' ఈమాటఅని ఆమెకొంచెంసేపుఆగింది. తిరిగి చెప్పడానికి ప్రారంభించింది.

'ప్రియా! ఇదీ ఒకందుకుమంచిదేననితోస్తుంది. వివాహవిషయంలో మనంచేసినఆరంభం శుభారంభంఅయిందికాదు. మనంవివాహంఅయి సుఖంగావుండడానికి నోచిపుట్టలేదు. సంఘన్యాయాన్ని మనంఅతిక్రమించాము. దేవుడిదృష్టిలో అది పాపకార్యంఅయింది. మనంధైర్యంవహించి మనప్రేమని సంఘన్యాయానికి సమ్మతమైందిగా ఏనాడో చేసుకోవలసింది. ఆ ధైర్యంలేనప్పుడు మనం అన్యోన్యంప్రేమించుకోవడమేతప్పు'

'లూసీ! నీవు ఆమాదిరిగామాట్లాడకూడదు.నాకు ఈవిశాలవిశ్వంలోప్రియతమమైనప్రాణివి నీవుఒక్కర్తివేఅనినమ్ము. బ్రతుకుమీద ఆశవదలకు. మనోధైర్యంవహించి ఆరోగ్యం

బాగుచేసుకో. మనం వివాహంచేసుకుని సుఖిద్దాము' అనిఏడ్చాను.

'ప్రియా! ఎందుకు దుఃఖపడతావు? మన వివాహం నీ సుఖానికిఅయేదికాదు. జరిగినవన్నీ ఆ విషయానికి దాఖలాఇస్తూనేవున్నాయి?' అనిచెబుతూ లూసీ గదినాలుగుమూలలా చూసింది. ఆమెనేత్రాలు కుర్రాణ్ణిచూడ్డంకోసం అల్లావెతుకుతున్నాయని నేను తెలుసుకున్నాను. బయటికి వెళ్లి దాదిచేతుల్లోంచి పిల్లాడిని తీసుకునివచ్చి ఆమెముఖందగ్గరకుచేర్చాను. లూసీ తనపెదవుల్నిఎత్తి వాణ్ణిముద్దుపెట్టుకుంది.

'సర్వదా ఈబాలుణ్ణి నీదగ్గరేవుంచుకో. ఎప్పుడుకాని అతణ్ణివదిలివుండకు. ఈకుర్రాడికి ఆత్మసంయమనం బాగా నేర్పు. తనకోరికలకంటె సంఘన్యాయాన్నే అధికంగా చూడాలనే విషయం అతనికి బాగా బోధించు.' అని చెబుతూవుండగానే ఆమెకంఠస్వరం క్రమంగా లోసానున పడిపోవడానికి ప్రారంభించింది. పిల్లాడిని తిరిగిముద్దుపెట్టుకుంది. పనిచేశేమనిషి ఎదురుగా ఏడుస్తూ నిలబడివుంది. ఆపిల్లాడిని ఆమెకు ఇచ్చి బయటికి పంపించివేయమంది. వాళ్లు వెళ్లిపోయినతరువాత లూసీ నాకేసి చూసింది. ఒకప్పుడు అత్యంతంగా నన్ను ఆకర్షించిన ఆమెనేత్రాలు వికృతపు చూపులు చూడ్డానికి ప్రారంభించాయి. క్రమంగా ఊపిరికూడా లోసానున పడిపోతూవుంది.

ఓర్చుకోడానికి శక్యంకానంత తీవ్రంగా బాధపెట్టబడుతూన్నవాడిమాదిరిగా అయింది నాపని. నేను అత్యంతంగా ప్రేమించిన ఏకైకస్త్రీవ్యక్తి నన్నువదిలిపోతూవుంది. ఆమెబిడ్డకు పేరుపెట్టాలనే కోరికకంటె ఆమెకు ప్రియతమమైనకోరిక మరోటి లేదు. కాని ఆకోరికే నెరవేరకుండా వుండిపోయింది. నేను ఇప్పుడు ఆమెపక్కను కూర్చుని బాధపడ్డం తప్ప ఏమీ చేయలేనివాడిని అయాను.

ఇక మిగతా కథఅంతా టూకీగా చెప్పేస్తాను. నేను పూర్తిగా పిచ్చివాడినై ఉన్నాను. ఒకవిషయం ఆలోచించడానికికాని ఒక కార్యకలాపం నిర్వర్తించడానికి కాని అసమర్థుణ్ణి అయాను. నాకున్నసమర్థతఅంతా బాధపడ్డంమట్టుకే.

ఈస్థితిలో ఏమీ తోచక మదరాసులోని మాచెల్లెలికి టెలిగ్రాము ఇప్పించాను. ఆమె వచ్చింది. సమస్తమూ తెలిసికొంది. నాస్థితికి ఆమె చాలా విచారించింది. నాస్థితికి ఆమె సానుభూతిచూపింది. కాని కక్కుస్థపడలేదు.

నాలుగుమూడురోజులు బెంగుళూరులోనే వున్నాము. తరవాత నేనూ మాచెల్లెలూ కుర్రాణ్ణి అతణ్ణి అతిశ్రద్ధతో పెంచుతూవుండే పనిమనిషినీ తీసుకుని మదరాసు వచ్చాము.

మాఅమ్మ నాకు మాతృహృదయంతో స్వాగతం యిచ్చింది. 'అమ్మా! ఈకుర్రాడు నాకొడుకు'! అని చెప్పేశాను. ఇదివరకే నాకు తగినంత శిక్ష జరిగిందని దయతలంచిందేమో కాని మాఅమ్మ ఆకుర్రాణ్ణి తనచేతుల్లోకి తీసుకుని అల్లారుముద్దుగా పెంచడానికి ప్రారంభించింది.

మనోవ్యథతో నేను పూర్తిగా క్రుంగిపోయాను. సర్వభ్రష్టు అయినట్లుగాఅయిపోయింది. నాహృదయావేదన్ని, మనోవ్యథను ఒకమాదిరిగా అయినా, మీకు వివరించి చెప్పడానికి తగినపదాలు నాస్వాధీనంలో లేవు- అసలు వాఙ్మయంలోకూడా లేవనే నాతాత్పర్యం. లూసీ నాకు ప్రాణాధికమైనవ్యక్తి. ఆమెమరణం నాకు గుండెల్ని తినేసే చింతగా వుండడమేకాకుండా అనుకున్నరోజుల్లో ఆమె

ను పెళ్లాడి సుఖపెట్టలేకపోతిని గదా అని బెంగ ఒకటి పట్టుకుంది.

బెంగుళూరురోడ్డుమీద లూసీకి కలిగిన మోటారుప్రమాదం అన్ని దినపత్రికల్లోనూ పడింది. నాప్రత్యర్థి. నన్ను బెంగుళూరులో చూచినవాడున్నూ అయిన చెట్టి నారహస్యాన్నంతా బయటపెట్టేశాడు. బెంగుళూరులోని దినపత్రికలూ, మదరాసులోని దినపత్రికలూ మా రహస్యప్రణయవృత్తాంతాన్ని ప్రచురించాయి. నాకు ఉంపుడంసంబంధంకూడా వుందనే సంగతి లోకానికి వెల్లడై పోయింది. ఎలక్షన్‌లో నాప్రత్యర్థులు దీన్ని అవకాశంగా తీసుకుని తీవ్ర ప్రచారం సాగించారు. ఓటర్లకు నేనంటే గౌరవం తుడుచుకు పోయింది. ఎన్నికల్లో నేను ఓడిపోయాను. కాని నాకేమీ కష్టం అనిపించలేదు. లూసీమరణంవలని దుఃఖం ముందు ఇవన్నీ గణింపరానివిగా నాకు తోచింది.

దురదృష్టదేవత నన్ను ఇంకా వదలకుండా కొట్టింది. నాభార్య ఆమెఅంతటఆమె నన్ను వదిలేసి పోయింది. లూసీకుర్రాణ్ణి నావద్దనే వుంచుకుని పెంచడానికి నేను నిశ్చయించినందువల్లనూ, ఎన్నికల్లో నేను ఓడిపోయినందువల్లనూ, నాకుగల ఉంపుడంసంబంధం అన్నిపత్రికల్లోనూ పడ్డందువల్లనూ ఆమె వెంటనే పుట్టింటికి వెళ్ళిపోయింది. విడాకు కొరకు కోర్టులో దావా తెచ్చింది కూడాను.

మాచెల్లెలు, అమ్మ, మరికొందరు పాత స్నేహితులు మాత్రం అపుడు నాతరఫున నిలబడి నాకు చేదోడువాదోడుగా ఉంటూ వచ్చారు. తరవాత క్రమంగా నాప్రాక్టీసు కూడా కొంచెం మంచిమార్గంలో పడింది. కుర్రాడికి విద్య చెప్పించేకొరకు నేను చాలా ధనం ఆర్జించేను.

కుర్రాడు మంచిఆరోగ్యంగా బొద్దుగా పెరుగుతున్నాడు. మంచి రూపసి. నాసమస్త ప్రాణాలు వాడిమీద పెట్టుకుని కంటికిరెప్ప లాగున కాపాడుతున్నాను.

ఉన్నట్టుండి ఒకక్రొత్తసమస్య సంఘటించింది – ఆసమస్యతో నాకు రాత్రిళ్లు నిద్రే పట్టడంలేదు. ఒకనాడు కుర్రాడు నావద్దకు వచ్చేడు. అతనిమొగంమీద ఆదుర్దా, విచారం ప్రస్ఫుటమై వున్నాయి. 'నాన్నా! ఈవేళ వాళ్ళఇజాక్‌ను పట్టుకుకొట్టాను. వాడు మా అమ్మ గుడిసేటిదని అన్నాడు. వాడి అభిప్రాయం ఏమిటి? నాన్నా!' అన్నాడు.

అప్రయత్నంగా నాచెయ్యి అతనిబుజం మీదకు పోయింది. నాశరీరం అంతా వేదనతో క్రుమిలిపోతూవుంది.

'అబ్బాయీ! వాళ్ల ఇజాక్ ఏదో తెలియక కారుకూతలు కూశాడు. మీఅమ్మ మంచిదనీ, మంచిప్రవర్తన కలదనీ నీకు చాలాసార్లు చెప్పివున్నాను' అని నేను అన్నాను.

ఇట్లా చెప్పి అతనికి లూసీఫొటో చూపించేను. అతనిఆదుర్దా ఏమీ తగ్గినట్లులేదు. 'నాన్నా! నీకు రెండుపెళ్లిళ్లు అయాయి అనే సంగతి నాకు తెలియదు. నీభార్యఫొటో అంటూ అత్త ఇదివరకు ఒకఫొటో చూపించింది.దీన్నిబట్టి నీకు ఇద్దరుభార్యలని తెలుసుకోవాలి' అన్నాడు.

ఏమీ సమాధానంచెప్పలేక అతణ్ణి దగ్గరకు తీసుకున్నాను.పూర్వావిషయాలన్నీ స్మృతిపథానికి వచ్చేయి. నాపిరికితనం, స్వార్థం రూపొంది ఎదట నిలబడ్డాయి. నాహృదయం దుఃఖభారంచేత కుమిలిపోతూవుంది.

కొన్నాళ్లకు అబ్బాయికి నిజం తెలిసిపోతుంది. తనతల్లికి పెళ్లికాకపూర్వమే తాను పుట్టేనని నిజవృత్తాంతాన్ని అతను తెలుసు

కుంటాడు. తరుణంలో తనతల్లిని నేను పెళ్లా డనందుకుగాను నామీఁద ఆకుఱ్ఱాడు పగపడ తాడేమోనని నాకు ఒకొత్తభయం పట్టు కుంది.

ఒకసంగతిమాత్రం నిశ్చయం. అతను తన తల్లిని దేవతామూర్తిగా కొలుస్తున్నాడు, కొలుస్తాడు.

నామీఁద అతనికి పగ కలగకుండావుండే ట్లు చెయ్యవలసిందిగా భగవంతుణ్ణి ప్రతి రాత్రి ప్రార్థిస్తూవున్నాను. అవినయనిధాన మైన నవయౌవనంలో ప్రవేశించడంతోటే అతడు నన్ను ద్వేషించకుండా వుండేటట్లు చేయవలసిందిగా దినదినమూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూవున్నాను.

పోయిన రోజులు ఒకసారి కూడివస్తే! లూసీ, నేనూ అన్యోన్యం ప్రేమించుకున్న రోజులు తిరిగివస్తే- ఆమెను పెళ్లాడి ఆమె కొడుక్కి నాపేరిస్తే- అబ్బాయి లోకుల దృష్టిలో కులటాపుత్రుడు కాకుండేవాడు కదా! నాయీకుఱ్ఱాడిప్రేమ ఎప్పుడైనా కోలుపోతానేమో అనేభయం నాకు ఉండ కుండేదికదా!

సూర్యస్తుతి

చ. కనదరుణాంబుజాతనవకాంతి నుదంచితభూరిచారుకాం
చనరుచిఁ దప్తతామ్రమవిలసద్ద్యుతి నూత్నలసత్ప్రవాళదీ
ప్తి నిజతనూద్గతాంశుతతి దిక్కులఁ బర్వ వెలుంగ నొప్పునీ
దినమణికి న్నభోమణికి దేవశిరోమణి కేను మ్రొక్కెదన్.

చ. ఘననిబిడాంధకారరిపుఖండనచండమయూఖరాజిచే
ననుదినము న్ప్రభాతములం దమృతాంశు మరీచి వేఁడిగా
వనజము లుల్లసిల్లఁగఁ దొవల్ మొగుడ న్బ్రథమాద్రిఁ బొల్చునీ
దినమణికి న్నభోమణికి దేవశిరోమణి కేను మ్రొక్కెదన్.

చ. అనుపమవేగసత్త్వసముదంచితవాహనవాహ్యమానకాం
చనరథచక్రసంకషణచారుసుమేరునగేంద్రసానుసం
జనితసువర్ణరేణుచయసంతతభూషితదీప్తియైన యీ
దినమణికి న్నభోమణికి దేవశిరోమణి కేను మ్రొక్కెదన్.

ఉ. ఏమహితాత్ముఁడెప్పుడును నెంతయు వెల్గుచు నుండు ఋగ్యజు
స్సామమయైకమూర్తి రుచిసంపద నే నిగమాత్ముఁ డర్థమా
త్రామయసూక్ష్మత న్వెలుఁగుఁ దద్దయు నే త్రిగుణాత్ముఁ డోంకృతి
శ్రీమయలీలసంతతముఁ జెల్వగు నారవి కేను మ్రొక్కెదన్.

చ. ఓనకర! యుష్మదీయతనుతేజము ద్రచ్చెద భక్తి నీకు వం
దన మొనరించుచు న్బహువిధంబుల నిన్ను నుతించుదు న్దయ
న్నను శుభదృష్టిఁ జూడుము సనాతన! కారుణికాగ్రగణ్య! య
త్యనుపమపుణ్య! సర్వనిగమాత్మక! నన్ను ననుగ్రహింపుమీ.

—మారనమహాకవి.

క్రొత్తగా కనుగొనబడినది! సరి క్రొత్తపద్ధతి!!

శస్త్రకర్మ అవసరములేకుండగనే

పలువురు టాన్సిల్సు బాధనుండి రక్షింపబడిరి.

మీరు మాత్రము యేల రక్షితులు కాకూడదు?

టాన్సినాల్

(రిజిష్టర్డు)



టాన్సిల్సు (గొంతులో కండలు పెరుగుట)ను ఆపరేషనులేకయే టాన్సినాల్ అను మందుచే గ్యారంటీగా కుదిర్చెదము.

దీర్ఘకాలమునుంచి ఉండినవి, తీవ్రమైనవి, అసాధ్యములుగ వదిలివేయబడినవి అయిన పెక్కు టాన్సిల్సు కేసులు నయము చేయబడినవి. పెక్కు వైద్యులచేతను, ఉన్నతోద్యోగుల చేతను పరీక్షింపబడి సిఫారసు చేయబడినవి. బహుమతులనుగూడ బడసినవి.

1. సర్ శేషా రామేశయ్యపంతులు గారు, కె.టి. రిటైర్డు హైకోర్టు జడ్జి, మదరాసు
2. సామి వెంకటాచలముశెట్టిగారు, యం. యల్. ఎ; మదరాసు.
3. ఖాన్‌బహదూర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్లా, మదరాసు.

మున్నగువారు యీమందును వాడి చూచి గుణవంతమై యుండుటను కనుగొన్నారు.

తయారుచేయువారు:

టాన్సినాల్ లేబరేటరీ,

53, గోవిందప్పనాయక్ వీధి, మదరాసు.

కన్సల్టింగు ఫిజీషియన్:

డాక్టర్. డి. అప్పారావు, యల్.ఐ.యమ్. (రిజి...)

టాన్సిల్సు స్పెషలిస్టు.

ఒకనాటి నా రైలుప్రయాణం

రచయిత:

రైవతుడు, సారస్వత సమాజము

జగ్గంపేట దుప్పటి, కొన్నూరు శాలువ, బళ్లారి కంబళి, ఉండి గొంగళి పొరమీద పొర కల్పించి, కిటికీలు మూసి, తలుపులు బిడాయించి నాలుగు గోడల సందునా పెట్టెవంటి గదిలో కదలకుండా మెదలకుండా పడుకున్నా గాని చలివచ్చి గజగజా వణికించివేసే ఈ శీతాకాలంలో కూడా దిక్కుమాలిన రైలు ఉదయాన్నే బయలుదేరాలా? కాస్త పొద్దు ఎక్కింతరవాత కొంచెం ఎండవచ్చింతరవాత బయలుదేరితే ఎంత సుఖంగావుంటుంది పోని చెప్పండి? కాలనియమమే కాని ఇవతలవాళ్ళ కష్టసుఖాలు కూడా కొంచెం విచారిద్దామనే విజ్ఞానం షష్టిఘడియలు నిరునిష్ఫతో వ్యవహారంచేసే ఈ రైలుకి ఎక్కడనుంచి వస్తుంది? ప్యాసెంజర్లు— అందులో రాజమండ్రి ప్యాసంజర్లు,—చాలామంచి వారు, ఎల్లాగైనా కార్యసానుకూలం చేసుకోవాలనే వారు కాబట్టి కాని లేకపోతే ఈరైలుపని ఏమయ్యేది? ఉదయాన్ని అయిదున్నరకి బయలుదేరినా సరే పుండువంటి చలినికూడా పాటించకుండా మాటలుకూడా తొణికే ఒళ్లు వణుకుతో స్టేశనుకు వస్తోవుండబట్టి కాని లేకపోతే ఈరైలు ఖాళీ పెట్టలతో బొప్పాయి గొట్టంలా ఊరికే పోవలసిందేగా!

రైలువేళకి లేవలేక పోతానేమో అని పడుకునేటప్పుడు అయిదింటికి అలారం యిచ్చి మరీ పడుకున్నాను. చలిచేత అలారం ప్రకాశంగా పలకలేక స్వగతం చేసుకుందోగామో కాని గడియారం అలారం కొట్టలేదు. నేను క[illegible]ను. ఈ స్థితిలో ఉండగా మాపక్కయింటి శా[illegible] పిలాడికి పాలో ఏవో పడుతూ చలిచేత వాడు లొంగటానికి వెనకా ముందూ తీస్తోంటే పితృవాక్యవ్యతిరేకం చేస్తూవున్న ఆకుర్రాడి మీద కోపం పట్టలేక కాబోలు 'తాగూ' అని ఇంటిపెంకులు ఎగిరి పోయేలాగ బొబ్బరించేడు. 'తాగూ' అనే ఆ బొబ్బ నాకు 'లేగూ' అన్నట్లు అయింది. ఆదెబ్బతో ఉలిక్కిపడి లేచికూర్చున్నా. ఇంతట్లో రైలుమాట జ్ఞాపకం వచ్చింది. కొండఎక్కి సరంజాములో ఉన్న దీపాన్ని హెచ్చించి గడియారంకేసి చూస్తునుగదా అది మూడుగంటలకే అనగా బ్రహ్మీముహూర్తం ప్రారంభమప్పుడే నిశ్చలధ్యానంలోపడి టక్కుటిక్కులు మాని నిశ్శబ్దబ్రహ్మంలో ఐక్యం అయి కొబ్బరిబోండంలా కూర్చుంది. స్విజ్జర్లాండు దేశంలో చేయబడ్డ ఈ గడియారం హిందూదేశంలో మన అవసరం గడుపుతుందా అని శుద్ధస్వదేశీవాదిలా విసుక్కుంటూ తొడిగిఉన్న బనియనుమీద షర్టువేసుకుని ఆత్మవిశ్వాసంగల మనపాండిత్యానికి ఒకళ్లు కప్పేది యేమిటని నాకు నేనే శాలువా కప్పుకొని సావిట్లోకివచ్చి మా అమ్మని లేపి వెళ్ళివస్తానని చెప్పేను. "నాయనా! మొగం కడుక్కొని కాస్త మజ్జిగ పోసుకొని మంచిమాట చేసుకొని మరీ వెళ్ళరా. బందరు వెళ్ళేసరికి సాయంత్రం నాలుగు అవుతుంది. నిడదోల్లోను, భీమవరంల్లోను, గుడివాడలోనూ, మూడుచోట్ల మారాలాయెను రైలు" అంది. అన్నంతింటే రైలు దాటిపోతుందనే భయం ఒకటి, చలి ఎక్కువౌతుందనే భయం ఒకటి. 'వద్దులే పొద్దెక్కినతర్వాత మార్గంలో మధ్యన ఏ స్టేషనులోనో తినవచ్చు' అంటూ నేను వీధిలోకి వచ్చా. చాలా కాలాతీతం అయింది. రైలు దొరక

రేమోనని గోదావరి గట్టుమీద పరుగు లంకించుకున్నా. రొజుకుంటూ నేను స్టేషనులో కాలుపెట్టేసరికి నాకంటె ఎక్కువగా రొజుకుంటూవచ్చి రైలు స్టేషనులో ఆగింది.

ఎడంచేతిలో మనీపర్సు, కుడిచేతిలో రెండు రూపాయలు పట్టుకొని టిక్కెట్లగూడు దగ్గిరికి పోయి ఒగర్పును ఒత్తిగించి, చలిని సాధించి 'సార్, సార్' అని దశగాయత్రీజపం చేయగా చేయగా, తొక్కుడు మిఠాయి ఉండలా నున్నగా గొరిగించిన బుర్రతో ఒక ఎర్రటి మనిషి ఎడంచేత్తో ఎడంముక్కు రంధ్రం నొక్కి కుడిచేతిలోని పొడుంపట్టు కుడిముక్కు రంధ్రంలోకి మా నాయనమ్మ గదికి ఉన్న ఉతకలతలుపు కిఱ్ఱును తలపించే ధ్వనితో ఎక్కించి చెయ్యిదులుపుకుంటూ 'ఆఁ-ఏం' అని ఏవిధమైన కంగారులేని శాంతిదూతలా అడిగేడు. 'ఆఁ-ఏం' ఏమిటి? వాడిఏడం? ఎక్కడికని అడుగుతాడా? 'ఆఁ-ఏం' అంటాడా? టిక్కెట్టుకోసం కాని వీడితోటి నేనేం వియ్యమందడానికి వచ్చేనా? ఓ పొడుంపట్టు ఇమ్మనడానికి వచ్చేనా? వాడి ప్రశ్నకు నిజంగా నాకు చాలాకోపం వచ్చింది సుమండి. కాని ఏంచెయ్యడానికి వీలులేక 'తొందరగా బందరుకు ఓటిక్కెట్టు ఇవ్వండి' అని రూపాయలు యిచ్చాను. రూపాయలు పుచ్చుకొంటూ ఆయన 'ఏమిటూ తొందర?' అన్నాడు. 'టైము ఉందా సార్' అన్నా నేను. 'టైము లేకపోతే యింకో ట్రెయిను వుంటుంది' అంటూ కాలంయొక్క విలవ కాని, నేను అత్తారింటికి వెళుతున్నాననే సంగతికాని తెలుసుకునే ఇంగితజ్ఞానంలేక ఆతడు టిక్కెట్టు తారీఖుల దాంట్లో పెట్టి నొక్కి కిటికీగూటి దగ్గిర పారేశాడు. ఇవ్వవలసి ఉన్నా సరే చిల్లర డబ్బులు అర్చి చచ్చినా ఇవ్వని రాజోజు తాలూకా షరాబుకు ఒక వేలు విడిచిన మేనమామకొడుకా వీడు అనిపించేటట్లు ఇవ్వవలసిన పావలా సంగతి ఎత్తకుండా నాకేసి వెన్నుతిప్పాడు. సార్, సార్, అని పావలాకోసం మళ్లీ దశగాయత్రి ప్రారంభం చేశాను. వేలకొలది సంవత్సరాలు వేళ్లు వెల్లంకులు తింటూ తపస్సు చేసినా అనుగ్రహం చూపని పురాణాల్లోని దేవతలలాగే ఈ టిక్కెట్ల దేవతకి ఈ దశ గాయత్రి జపంతోటి అనుగ్రహం రాలే. పక్కని టేబిలుమీద ఉన్న మినిమమ్ సైజు గ్లాక్సో డబ్బా మూత మిటకరించి ఎత్తి అందులోంచి తులమో తులమున్నరో— మసిపట్టిన మా చిన్నకాఫీగిన్ని తోమడానికి పనికి వచ్చే ఇటికిపొడుమంత— ఏదో చూర్ణంతీసి మొగం దగ్గిరికి చేర్చేడు. వెనక్కి తిరిగి ఉండడంచేత ఆయన దాన్ని ఏమిచేశాడో నేను చెప్పలేను. కాని ఈ కథఅంతా తర్వాత నావల్ల విన్న నామిత్రులు ఒక హైస్కూలు సీనియరు తెలుగు పండితులుగారు అది తప్పకుండా నశ్యమే అయి ఉంటుందనీ, పొడుంగోలలోపడి పావలా సంగతి ఆయన మఱచిపోయి ఉంటారనీ చెప్పేరు. శాస్త్రులవారియందు నాకు గౌరవం ఉందికాబట్టి ఆయనమాట మీరు విశ్వసించినా విశ్వసించక పోయినా నేనుమాత్రం విశ్వసించే ఉన్నాను. మీరు వద్దని చెప్పినా దాన్ని మానేటందుకు నేనేం వ్యక్తిస్వాతంత్ర్యం లేనివాడిని కాను.

సరే అది అల్లా ఉంచండి. ఈవతలపడి నేను ఇల్లాగింజుకుంటూఉన్నా ఆయన తన్నుకొనట్టు ఊసుకున్నాడు వెనక్కితిరిగి. మా ఊరి అవతలపుంతలో మఱ్ఱిచెట్టుకింద (పిల్లలు భయపడతారేమోనని) వెనకముఖంగా నిలపెట్టబడి ఉన్న రాతి పోతురాజులా ఉన్న ఆయన్నిచూచి నా అరికాలుమంట నెత్తికి వచ్చింది. చిల్లపెంకు, చింతపండు వేసి తెల్లగా తోమికడిగి బోర్లించిన మా రామచంద్రుడు మామగారి రూపాయి రాతిచిప్పలా ఉన్న వాడిబుర్రమీద మా తాతయ్య ములకొలకర్ర తెచ్చి ఒకదెబ్బతీద్దామనేటంత కోపంవచ్చింది. కాని వీల్లేదు. ఆడదాన్లా లోపల ఉండిపోయేదు. కర్ర వెయ్యలేని వాడి పొన్నకాయ బుర్రమీద కన్నువేసి కోపం చంపుకోలేకుండా నిలచివున్న నాసంగతి కనిపెట్టింది కాబోలు రైలు 'పావలా పదట్లోగలయ్య-వాడు నాలు

గుసార్లు గడ్డం గీయించుకుంటాడు- నీవు రావోయి, ఇంక నేను నిలచేదిలేదు...' అంటూ కేక వేసింది. వుట్టి వుత్తరంమీద-వుట్టి వుత్తరంకాదు, పొరపాటు ముక్కానీకార్డు—అత్తవారింటికి వెళ్లుతూవున్న నేను స్వయంగా కేక వేసి పిలుస్తోన్న రైలుని తృణీకరించ లేక వెంట నేవెళ్ళి ఒక పెట్టిలోకూర్చున్నా. ఓవరు సీయరుగారు ఎక్కిన తర్వాత ఒక్క నిమిషమేనా ఆగని మేలుపడవలాగ నేను ఎక్కడంతోటి రైలు—మర్యాద తెలి[illegible]దికాబట్టి-కదిలింది. నాపాపవలా పలహారంచేసిన బొడిబుర్ర ఎర్రపంతులు గారు ప్లాటుఫారముమీద నిలిచి ముక్కుదగ్గిర మాదాసీది వుపయోగించే అలుకుగుడ్డకంటె కూడా బాగా రోతగా ఉన్న జేబురుమాలు పెట్టుకొని ఏవో ఎగుమతి దిగుమతులు చేస్తూ వున్నాడు. 'జరిగిందేదో జరిగింది. వాడిజోలి సొంటి నీకెందుకు?' అని రైలునన్ను గబగబా దూరంగా తీసుకుపోయింది.

నిజాము రాజ్యమున

౧. వెంకట్రామా అండు కో; 3993 మార్కట్టుస్ట్రీటు, శికిందరాబాదు.

అనువారిని ఆంధ్రభూమికి ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటిష్ పోస్టలు సౌకర్యములు లేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజామురాష్ట్రాంధ్రులు ఇకమీదట తమ తమ చందాధనమును వారికి పంపుచు ఆ విషయమును ప్రత్యేకముగ మా కార్యాలయమునకు కూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యుల సౌకర్యార్థము వీరు మాసము మాసము ఆంధ్రభూమి విడిసంచికలు విక్రయింతురు.

౨. కంభంపాటి అచ్యుతానందముగారు, (కమీషన్ యేజెంటు, ఆనందాయుర్వేదాశ్రమము).

అనువారిని హనుమకొండలో మాఏజెంట్లుగ నియమించినాము.

ఏడాదికి పదమూడులక్షల మోటారుల విక్రయము

[చెవ్రొలెట్ మోటారుకంపెనీవారి సేల్సుమేనేజరు రిచ్చర్డు హెచ్. గ్రాంటు వస్తువిక్రయవ్యాపారరహస్యవివరణము.]

హెన్రీఫోర్డు మోటారురాజు. అట్టి ఫోర్డు మోటారు కంపెనీకంటె హెచ్చుగా మోటారులను అమ్ముకంపెనీ మరియొకటి బయలు దేరినది. అది చెవ్రొలెట్ మోటారుకంపెనీ.

మోటారుకారులు, బస్సులుకూడ ఇపుడు ఆంధ్రదేశీయులకు చిరపరిచితమైనవై యున్నవి. కారునుకాని, బస్సునుకాని చూచిన మాత్రముననే అది ఏకంపెనీకి చెందినదో చెప్పగలవారు ఇపుడు ఆంధ్రదేశమున వేల కొలదిగ నున్నారు. ఫోర్డుబస్సులు, చెవ్రొలెట్ బస్సులు మనదేశమున విస్తరించి యున్నవి. మోటారుప్రపంచమున అద్వితీయుడే అయినను ఫోర్డు తనకారునమూనా మార్చి చెవ్రొలెట్ కారు మాదిరిగా చేయవలసి వచ్చినది. దానికి కారణము ఫోర్డుకారుల కంటె చెవ్రొలెట్ కారులు విశేషముగ వెలకు పోవుటయే.

ఫోర్డుబస్సుల, కారులకంటె చెవ్రొలెట్ బస్సులు, కారులు హెచ్చుగా వెలకు పోవుటకును—చెవ్రొలెట్ కారులను చూచి ఫోర్డు అంతటివాడు తనకారుమాదిరి మార్చుకొనవలసివచ్చుటకును కారణము చెవ్రొలెట్ మోటారుకంపెనీవారి అమ్మకపు మేనేజరైన రిచ్చర్డు హెచ్. గ్రాంటు ప్రతిభయు, పరిశ్రమయు.

1924-వ సంవత్సరమునుండియు గ్రాంటు చెవ్రొలెట్ మోటారుకంపెనీవారి సేల్సు మేనేజరుగా ఉన్నాడు. నాలుగు సంవత్సరములలో అతడు చెవ్రొలెట్ కారుల అమ్మకమును ఐదురెట్లు అభివృద్ధికి తెచ్చినాడు. 1924 లో రెండులక్షల ఏబదివేలకారులు మాత్రము అమ్మగా 1928 లో పండ్రెండులక్షల ఇరువదియైదువేల కారులు అమ్మినాడు.

ప్రపంచమునందలి మఱియేకంపెనీకిగాని ఇంతటి సేల్సుమేనేజరు లేడు. ఈవిషయమున అతనికీర్తి అద్వితీయమైనది. అమెరికావారికే గాని యూరప్ఖండమువారికి అతనినిగూర్చి విస్తారముగ తెలియదు.

అతడు స్కాటిష్జాతికి చెందిన అమెరికన్. అతని తలిదండ్రులు ధనవంతులు. హార్వర్డులో విద్యాభ్యాసముగావించినాడు. ఆ విద్యాభ్యాసము అతని వ్యాపారనైపుణ్యమును చల్లార్చలేదు.

మూడు సంవత్సరములు ఒకానొక టెలిఫోను కంపెనీలో సేల్సుమెన్‌గా ఉండినాడు. తరువాత నేషనల్ క్యాష్‌రిజిస్టరు కంపెనీలో ఉద్యోగమునకు కుదిరినాడు. తొమ్మిదియేండ్లలో ఆ కంపెనీకి సేల్సుమేనేజరు అయినాడు.

అతని మూడవ ఉద్యోగము ఇంతకంటెను కష్టమైనది. డెల్కోలైట్ కంపెనీవారు వ్యవసాయదారులకు తమలైటింగు ప్లాంట్లను అమ్మపనికి అతనిని కుదుర్చుకొనినారు. అప్పటికి ఆసామగ్రిని తయారుచేయువారు ఏబదిమంది యుండిరి. వారు అందరును కలిసి ఏడాదికి పదివేల లైటింగుప్లాంట్లకంటె ఎక్కువ అమ్మలేకపోవుచుండిరి.

అప్పటికి గ్రాంటునకు ముప్పదిఏడేండ్లు. దీక్షతో పనికి పూనినాడు. ఏడాదికి తన కంపెనీవారి లైటింగు ప్లాంట్లు ఇరువదియైదు

వేలు విడుదల చేయించినాడు. తాను స్వయముగ వెళ్ళినాడు. ఆసామగ్రికి అవసరమును కల్పించినాడు. ఏబదిమంది ఉత్పత్తిదారులు కలిసి ఏడాదికి పదివేలు అమ్మలేకుండిన పరిస్థితులలో తానొక్కడు తనకంపెనీవారివి యేడాదికి ఇరువదియైదువేల వస్తువులను విక్రయించినాడు. ఇది వ్యాపారప్రపంచమున జరిగిన ఒక గారడీయని అనకుండనుండగలమా?

తరువాత ఎలక్ట్రిక్ రిఫ్రిజిరేటరులు అమ్ము కంపెనీలో చేరినాడు. అక్కడకూడ అమ్మకమువిషయమున అపూర్వమైన గారడీ చేసినాడు.

అమ్మకములలో అతిలోకానుభవము కలిగినది. హెన్రీఫోర్డు అంతవానికికూడ పైచేయికాగల పరిస్థితులు ఏర్పడినవి. వస్తువిక్రయమున గ్రాంటు సంపాదించిన అపూర్వాభిమానము నుపలక్షించి షెవ్రొలెట్ మోటారుకంపెనీవారు అతనిని తమకంపెనీలో సేల్సుమేనేజరు ఉద్యోగమునకు ఆహ్వానించిరి. ఆత డాయాహ్వానమును చేకొనెను.

అతడు ఆఉద్యోగము స్వీకరించిన మొదటి సంవత్సరములో (1925-వ సంవత్సరమున) కారుల అమ్మకము అంతకుముందు సాలునకంటె రెట్టింపు అయినది. తరువాతి రెండు సంవత్సరములలో ఆవ్యాపారము తిరిగి ద్విగుణమైనది. 1929 లో నూటికి పండ్రెండు నరవంతున అభివృద్ధినందినది. ఆ యేడు ఆతడు పండ్రెండులక్షల ఇరువదియైదువేల కారులను విక్రయించినాడు. అప్పటికి గ్రేట్ బ్రిటన్ మొత్తముమీద ఉన్న కారులసంఖ్యకంటె కూడ ఆ అమ్మకము విశేషమైనది.

అయితే ఇంత విశేషమైన అమ్మకము కావింపగలుగుటకు అతడేమైన అపూర్వమైన పద్ధతి అవలంబించునా?

నిర్ణీతమైన పద్ధతి లేనిదే అతడు అసలు అమ్మకమునకే గడంగడు. తాపీమేస్త్రీ తాను కట్టబోవు ఇంటిప్లాను ముందే ఎట్లు తయారు చేసికొని యుంచుకొనునో అట్లే గ్రాంటుకూడ తాను చేయబోవు అమ్మకమునుగూర్చి ముందే సర్వము ఆయత్తపఱచుకొని యుంచుకొనును. ప్రదర్శనము, ప్రకటన—ఇవి అతని అమ్మకపువ్యాపారమున ప్రధానాస్త్రములు.

అమ్మువారియెడల మర్యాద- అతని నియమములలో నిది యొకటి. తృప్తిగల వ్యాపారులమీదనే అతనిదృష్టి లగ్నమైయుండును. ఒక్కొక్క వ్యాపారికి నిర్దిష్టమైన మండలమున మరియొక వ్యాపారి ప్రవేశించుటకు అతడు అంగీకరింపడు. ఆవ్యాపారులుకూడ తన భాగస్వాములైనట్లే అతను వర్తించును. వారి హక్కులను నిక్కచ్చిగా కాపాడును. వారి ప్రకటనలకు, జమాఖర్చులను సరియైన స్థితిలో ఉంచుటకు, పాతకారులను అమ్ముటకు అమితముగ సాయపడును. వారు అమ్మగలిగినవానికంటె హెచ్చుసంఖ్య కారులను కొనమని ఆవ్యాపారుల నాతి డెన్నడును బలవంతము చేయడు.

అతని యాజమాన్యమున అతని కంపెనీకి నాలుగు వేలఐదువందలమంది డీలర్లు, ఐదు వేల ఐదువందలమంది అసిస్టెంటు డీలర్లు ఉన్నారు. వారు అందరును అతనికి మంచి స్నేహితులు. నెలనెలకు వారివద్దనుండి రిపోర్టులు తెప్పించుకొనును. పైగా తనక్రింద పని చేయుచున్న యేబదిముగ్గురు సేల్సుమెన్నును సూపరువైజర్లుగా పంపుచు డీలర్లకు తనకు వ్యవహారము సన్నిహితము గావించుకొనుచుండును.

వ్యాపారులకు ఆవ్యాపారవిషయమై విజ్ఞానము కలుగుటకు ఫిల్ములు, కరపత్రములు,

పోస్టర్లు, కార్డులు, పుస్తకములు సరఫరా చేయుచుండును. వ్యాపారులు ఎప్పుడుకాని మందకొడిలో పడక ఉత్సాహముగ నుండు నట్లు జాగ్రత్తవహించుచుండును. మంచి వ్యాపారము చేసినవారిని అతడు బాగుగ శ్లాఘించును.

'ఎల్లప్పుడు ఒక క్రమమైనపద్ధతి ఉండవలెను. అమ్మకమునకు ప్రోత్సాహము ఉండవలెను.' అని అతను చెప్పును.

అతనిపుట్టుక 1888 లో. అతను పొట్టివాడు. నెమ్మదిగ మాటలాడును. అతడు విశ్రాంతిసమయములందు అతనికిగల మూడు వందల యకరముల పొలములో పనిచేయుచుండును. భూమిని చీల్చుకొని మొక్కలు పైకివచ్చి బాగుగా పెరుగుటను చూచుటకు అతను కుతూహలుడగుచుండును.

అతని అమ్మకపు పద్ధతులు యేవస్తువిక్రయమునకైనను అక్కరకువచ్చునవే. టెలిఫోను వ్యాపారమునకు, కాష్ రిజిష్టర్ల విక్రయమునకు, లైటింగుప్లాంటుల అమ్మకమునకు, ఎలక్ట్రిక్ రిఫ్రిజిరేటర్ల విక్రయమునకు, మోటారుకారుల అమ్మకమునకు అతడా పద్ధతులను వినియోగించినాడు.

బట్టలు, బొగ్గు, ఉక్కు, ఇనుము, ఉన్ని మొదలగు ఏవ్యాపారమునందుగాని వానిని ఏల ఉపయోగింపరాదు?

విక్రయమునకు ప్రత్యేకముగా కొన్ని సూత్రములు లేవనువారును, విక్రయమున దక్షత నేర్చుకొనిన వచ్చునది కాదనువారును ఈరిచ్చర్డు హెచ్. గ్రాంటు చరిత్రను-నాలుగు సంవత్సరములలో తనకంపెనీవారి అమ్మకపు వ్యాపారము ఐదురెట్లు పెంచిన గ్రాంటు చరిత్రను- చదువవలసియున్నది.

గ్రాంటు జీవితమునుండి మనము నేర్చుకొనవల్లసినది యేమియులేదని చెప్పగల విక్రయదారులు ఎవరైన నుందురా?

మగనితలమీద తెల్లవెంట్రుక కనిపిస్తే

రచయిత:
ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

పడుచుతనానికి ముసలితనానికి మధ్యగావుండే వయస్సులో ఒకడు మొదటిపెళ్లానికితోడు పడుచు పెళ్లాన్ని ఓదాన్ని కట్టుకున్నాడనీ; వాళ్లు ఇద్దరూ సగం సగం నెరసిన అతని తలనుపట్టుకుని ముసలిది నల్లవెంట్రుకలు, పడుచుది తెల్లవెంట్రుకలు పీకేశారనీ వినోదంగా మన పెద్దలు ఓకథ చెపుతారు. అయితే ఈ కథలోని ముసలాడిపెళ్లాల్లా అందరి పెళ్లాలూ మగని వెంట్రుకల్ని పీకే పెంకిరకం మనుష్యులే అయివుండరు. ఆడదానిది అపరబుద్ధి అని మగవాళ్లు ఎంత ఈసడించినా ఆడవాళ్లల్లో కూడా మహా మంచివాళ్లు లేకపోలేదు. మగనితలమీద తెల్ల వెంట్రుక కనిపిస్తే పైకథలోని పడుచుపెళ్లాంలాగు దాన్ని పీకివేయడంకాని, ఆధునికపురుషుని చదువుకున్న భార్యలాగు వెంట్రుకలరంగు పులమడం కాని చేయకుండా మగని తెల్లవెంట్రుకను తన మహిమచేత తిరిగి నల్లవెంట్రుకగా చేసిన మహాపతివ్రత ఒకర్తె వుంది.

రాళ్లను శనగలుగావేయించిన పతివ్రత-బ్రహ్మవిష్ణుమహేశ్వరులను పిల్లలుగాచేసిన పతివ్రత-సూర్యోదయం కాకుండా చేసిన పతివ్రత పుట్టినభారతదేశంలోనే మగనితలమీద తెల్లవెంట్రుకను నల్లవెంట్రుకగాచేసిన పతివ్రత కూడావుంది. ఇతర పతివ్రతల కథలలాగే ఈ పతివ్రత కథకూడా పురాణాల్లోనే దొరకుతూవుంది. అందరి పతివ్రతల కథలూ ఈ వరకే ప్రచారంలోవున్నాయి. కాని నేను చెప్పబోయే పతివ్రతకథమాత్రం ఇంతవరకు బాగా ప్రచారంలోకిరాలేదు. ఈశ్రీరామమూర్తి వ్రాసే కథ చదివేదేమిటనిగాని, ఈ వెంట్రుకలపతివ్రతవృత్తాంతం తెలుసుకునేదేమిటనిగాని తృణీకరించక దీన్ని శ్రద్ధగా పఠించవలసిందిగా ప్రార్థిస్తూవున్నాను. ముఖ్యంగా నాసోదరీమణులను ఈ విషయాన్ని మిక్కిలి శ్రద్ధతో చదవవలసిందిగా కోరుతూవున్నాను.

పూర్వకాలంలో రాజ్యవర్ధనుడు అనేరాజు వుండేవాడు. అతనికి మానిని అనేమహాయిల్లాలు భార్యగావుండేది. మన కథాకాలంనాటికి అతని పట్టాభిషేకంఅయి ఏడువేల సంవత్సరాలు అయింది. మానినికి తాను రాణిని కదా అనేగర్వం కొంచెంకూడా లేదు. దాసీవాళ్ళకు చెప్పక మగనికిచేసే సపర్యలన్నీ ఆమె స్వయంగా చేసేది. ఇల్లా వుంటూవుండగా ఒకనాడు ఆమె మగనికి తలఅంటుతూవుంది. ఆసమయంలో ఆమెకళ్ళల్లోంచి నీటిబిందువులు జారి రాజు శరీరంమీద పడ్డాయి.

మానిని కాపరానికి వచ్చి వేలకొద్దీ సంవత్సరాలయింది. కాని ఆమె ఇంతవరకు ఒక్కసారికూడా కళ్ళను నీళ్ళుపెట్టుకోలేదు. అట్లాంటి సందర్భంలో ఆవేళ ఆమెకళ్ళవెంట నీళ్లుపుట్టాయి అంటే రాజుకు పై ప్రాణాలు పైనే పోయినట్లు అయింది. ఆమె అల్లా కళ్ళను నీళ్లుతెచ్చుకోవడానికి కారణమేమిటని అతను అడిగాడు. ఆమె ఏమీ జవాబుచెప్పలేదు. తరిచితరిచి అడిగాడు. చివరకు ఆమె అతనికి అతని తలమీద ఒక తెల్ల వెంట్రుక చూపిస్తూ ఇల్లా చెప్పింది :

'మహారాజా! నీతలమీద ఓ తెల్ల వెంట్రుక కనిపించింది. ఇంతకంటె నాకు హెచ్చయిన విషాదహేతువు ఏమివుంది ?'

ఇట్లా చెబుతూ ఆమె మరింతగా కళ్ళను నీళ్ళుపెట్టుకుంది. రాజు ఆమెచెప్పింది విన్నాడు. ఆమెను

నిదానించి చూచేడు. చిరునవ్వు మొగంతో 'పుట్టడం, పెరగడం, నశించడం అన్ని ప్రాణులకూ ఉన్న ధర్మం. నీవు బాగా చదువుకున్నదానివి. నీకు ఈ ప్రకృతి ధర్మం తెలియనివిషయంకాదు. అయినా నీవు అజ్ఞానంలోపడి విచారించడం కూడనిపని. ఇక నా సంగతి. వేదాలు చదివేను. శస్త్రాస్త్రవిద్యలు నేర్చేను. శత్రువులను చెండాడేను. రాజ్యపాలనం సాగిస్తున్నాను. ఎన్నోయజ్ఞాలుచేశాను. నీతో చిరకాలంగా సంసారసుఖం అనుభవిస్తూవున్నాను. సకల పురుషార్థాలు నాకు సంభవించాయి. ఇక ముసలితనానికి భయపడ్డం కేవలం వెర్రితన మనిపించుకుంటుంది. వెంట్రుకలు తెల్ల పడ్డంచేత ముసలితనం పైబడుతోందని తెలుసుకొని మాపెద్దలమాదిరిగా నేనున్నూ రాజ్యాన్ని వదిలేసి తపస్సుచేసుకోడానికి అడివికి పోతాను. తెల్ల వెంట్రుకలు మనకు ఈవిధంగా శుభాన్నే కూర్చేవి అగుచున్నాయి.' అని రాజు ఆమెను ఊరడించడానికి ప్రయత్నించాడు.

రాజు తపస్సుచేసుకోవడానికి అడివికిపోనున్నాడనే సంగతి మంత్రులు, పౌరులు విన్నారు. ఏడు వేల సంవత్సరాలుగ తమ్ము కన్నతండ్రిలాగు పరిపాలిస్తున్న రాజుతోటి వియోగానికి వాళ్లు భయపడ్డారు. వెంటనే వాళ్లు గుంపులుగుంపులుగా వచ్చి రాజు ఎదట నిలబడి ఇట్లా మొరపెట్టుకున్నారు :

'మీరుచెప్పినట్లు మీతలమీద కనిపించిన తెల్ల వెంట్రుక దేవిగారికి అంత విచారంకలిగించవలసింది కానేకాదు. ఆవిచారంఅంతా మాది. మీరు అడివికి వెళ్ళిపోతే మాకు ఇక్కడ సర్వక్రియాహాని అవుతుంది. ఏడువేల సంవత్సరాలు రాజ్యపాలనంచేసి గడించిన సుకృతంఅంతా ఇప్పుడు తుడుచుకుపోతుంది. కాబట్టి మాఅందరిమీదా దయనిలిపి మామూలుగా రాజ్యపాలనం చేస్తూవుండవలసిందిగా ప్రార్థిస్తూ వున్నాము.'

ఆమాటలకు మహారాజు 'ప్రజలారా! ఈ రాజ్యం అంతా ఏడువేలఏళ్ళనుంచి ఏలుతూవున్నాను. భార్యతో సంసారసుఖం అనుభవించేను. సంతానం పొందేను. ఇంక తపోవనానికి పోవడమే కోరతగింది. నాతలమీద కనిపించిన తెల్ల వెంట్రుక యముధర్మరాజుకి ప్రియమైన దూతఅనుకోండి. కాబట్టి నా కొడుక్కి పట్టాభిషేకంచేయడానికి తగిన ముహూర్తం ఏర్పాటుచేయవలసివుంది' అన్నాడు.

ముహూర్తంపెట్టడానికి దైవజ్ఞుల్ని రావించాడు. వాళ్లు రాజుప్రయత్నాన్ని విని నిలువునానీరైపోయారు. వాళ్ళకి ఏమిచెప్పడానికీ తోచిందికాదు. 'మహారాజా! మామనస్సులు శోకవికలాలయి వున్నాయి. లగ్నంకట్టలేము' అన్నారు.

మంత్రులు, ప్రజలు, పురోహితులు, దైవజ్ఞులు అందరూ కలిసి రాజును ప్రార్థించారు అడివికి పోవద్దని. రాజు తనప్రయత్నాన్ని మానినట్లు కనిపించలేదు. అందుచేత వాళ్ళకు ఏమిచేయడానికిన్ని ఆలోచన తట్టిందికాదు.

అప్పుడు మానినీదేవి మనం సూర్యభగవానుణ్ణి ఆరాధించి మనరాజుగారిని అధికాయుష్మంతులుగానూ, యౌవనవంతులుగానూ చేసుకుందాము అని అంది.

ఈపద్ధతి అందరికీ నచ్చింది. ఆరాజ్యంలోని అశేషజనమూ సూర్యోపాసకులయారు. వారి అందరికీ మానినీదేవి వుపదేశికురాలు అయింది. ఇంతమంది అతినిష్ఠతో తన్ను కొలుస్తూవుండగా సూర్యభగవానుడు మిక్కిలి ప్రీతుడై ప్రత్యక్షమయ్యాడు. వరాలు కోరుకోమన్నాడు. తమరాజు ముసలివాడుకాకుండా, అపజయం ఎరక్కుండా పదివేలసంవత్సరాలు బ్రతికి ప్రజాపాలనం చేశేటట్టు కోరారు. అతను వరదానం చేశాడు.

అయితే ఈసంగతివిని రాజు సంతోషించలేదు. మానినీదేవిమాత్రం ఆనందసముద్రంలో మునిగి తేలుతూవుంది. అప్పుడు రాజు రాణీతో 'ఇది ఏంవరం ? పదివేలయేళ్లు నేను బ్రతికివుండాలి. ఈలోగా బంధువులందరూ స్వర్గానికి పోతారు. నేను ఏకాకిగా ఇక్కడ వుండిపోతాను. ఇల్లాగు బ్రతకడంకూడా ఒక బ్రతుకేనా?' అన్నాడు.

ఇందులోకూడా కొంత సత్యంవున్నట్లు రాణీకి తోచింది. అప్పుడు ఆమె తపస్సుచేసి సూర్యుణ్ణి మెప్పించి రాజుకూడా ప్రజలకొరకు అదేమాదిరి వరాలు పొందేటట్లు ప్రోత్సహించింది.

ఇదిఅంతా మానినీదేవి మగనితలమీద తెల్ల వెంట్రుక చూడ్డంవల్ల సంఘటిల్లింది. ఆరోజుల్లో భార్యల అనురాగమూ, ప్రజల రాజభక్తి, రాజుల రంజకత్వమూ ఆవిధంగావుండేవి.

వస్తువులు పోగొట్టుకునే అలవాటును గురించి

రచయిత:
ఏ. శేషాచలపతి, బి. ఏ.

మనస్నేహితుల్లో ఎప్పుడుకాని యేవస్తువా పోగొట్టుకోనివాళ్లు కొందరుంటారు. మరికొందరుస్నేహితులు ఎప్పుడూ యేదోవస్తువును పోగొట్టుకుంటూనేవుంటారు. ఇల్లా పోగొట్టుకునే వస్తువుల్లో గొడుగులు ప్రధానమైనవని ఒప్పుకోకతీరదు.

ఎప్పుడూ యేమీా పోగొట్టుకోని మనుష్యులతీరు ఒకమాదిరిగావుంటుంది. వాళ్ల అక్కవుంటు యేరాత్రికి ఆరాత్రి అణా పైసలతో సరిపోతుంది. వాళ్లు యేదేనావస్తువుని ఒకసారి కొనుక్కున్నారా అది వాళ్ల జీవితాంతంవరకు వుండిపోతుంది

ఇక ఎప్పుడూ యేదోవకటి పోగొట్టుకొనే మనుష్యులతీరు మరోమాదిరిగా వుంటుంది. నామట్టుకు నేను ఈ జాతిమనుష్యుల్లోనే జేరతాను. వివక్షతలేకుండా నేను అన్నిరకాల వస్తువులు పోగొట్టుకుంటాను. గొడుగులు. పుస్తకాలు, చిల్లరిడబ్బులు, తాళంచేతులు మొదలైనవన్నీ నేను పోగొట్టుకునే వస్తువుల్లోనే జేరుతాయి. ఒకసారి బజారుకు మరమ్మతుకు తీసుకుపోయిన గోడగడియారాన్నే నేను ఎక్కడో మరిచిపోయి పోగొట్టుకున్నాను.

అయితే ఈ రెండురకాల మనుష్యుల్లోనూ వుండే తేడాయేమిటి?

కొందరు అంటారుకదా వస్తువులు పోగొట్టుకునేవాళ్లు మందమతులై వుంటారని. కాని నాకు ఈవాదం నచ్చలేదు. జ్ఞాపకశక్తికీ వస్తువులు పోగొట్టుకొనడానికీ యేమీా సంబంధంలేదు. అష్టావధానం, శతావధానం మొదలైన అవధానాలు చేసేటంతటి ధారణాశక్తి వున్నవాళ్లుకూడా గొడుగులు మొదలయిన వస్తువుల్ని పోగొట్టుకుంటూవుంటారు. అంతమాత్రంచేత వారికి జ్ఞాపకశక్తి లేదనడానికి వీలులేదు. నామట్టుకి నాసంగతి చూడండి. యేపద్యమైనా ఒకసారి చదివానంటే నాకు కంఠతా వచ్చేస్తుంది. నేను చదివిన వినోదకథలూ, విన్న హాస్యపుమాటలూ ఎప్పటికికాని నేను మరిచిపోను. అవసరమైనప్పుడల్లా వానిని ప్రస్తావనలో మెదుపుతూనేవుంటాను. ఎప్పుడో చిన్నప్పుడు భూగోళశాస్త్రంలో చదివిన గోదావరిఉపనదుల పేళ్ళన్నీ ఇప్పటికికూడా మరిచిపోకుండా ఒక్కతప్పైనా లేకుండా చెప్పగలను. అక్బరు ఎన్నోయేట రాజ్యానికి వచ్చేడో, పెద్దాపురసంస్థానం ఎప్పుడు అన్యాక్రాంతం అయిపోయిందో, మాదొడ్డమ్మ యేయేతీర్థంలో యేయే రాతిచిప్పలు ఎంతెంత ఖరీదుకు కొన్నదో మొదలైన చారిత్రకవిషయాలూ, సంసారికవిషయాలూ నాకు బాగా జ్ఞాపకంవుంటాయి. ఇల్లాంటి సందర్భంలో గొడుగులు మొదలైన వస్తువుల్ని పోగొట్టుకోడానికి జ్ఞాపకశక్తి లేకపోవడం కారణంఅని నేను ఒప్పుకోను.

నామతానికి ఒకలాగు తోస్తుంది. అసలు వస్తువులు పోగొట్టుకునేవాళ్ళకు మిగిలిన అందరికంటె హెచ్చు జ్ఞాపకశక్తి వుంటుందని

నాకు తోస్తుంది. వారిమేధస్సు చాలా విశాలమైందనీ, అది ఒకేసారి ఒక్కవిషయాన్నే గాక పలువిషయాల్నిగూర్చి ఆలోచిస్తూ వుంటుందనీ నా అభిప్రాయం.

వస్తువులు పోగొట్టుకునేవారు మందమతులై వుంటారనే జనవాదుక సత్యసమ్మతమైంది కాదని నాతలంపు. అన్నివిషయాల్లోనూ ఆ వ్యక్తి ప్రజ్ఞామతిఅయి ఉండి వస్తువులను పోగొట్టుకునేటప్పుడు, మాత్రం మందమతి అయివుంటాడని అనడం సమంజసంగా వుంటుందా? అయితే ఆసమయంలో గొడుగు మొదలయిన వస్తువులవిషయంలో కాక ఆవ్యక్తి మనస్సు యేవిషయంలో జాగ్రత్తవహిస్తుంది? అసలు ఆవస్తువునుండి అది అల్లా ఎందుకు చెదరివుండాలి? బహుశా ఆవస్తువుమీద ఆ వ్యక్తికి అంత మమకారం లేదేమో! స్వల్పాతిస్వల్పమైన గొడుగులు మొదలైన వస్తువులకు ఆవ్యక్తి అతీతుడేమో!

గొడుగులు ఎండనుంచీ, వాననుంచీ మనల్ని కాపాడతాయి. ఒక్కొక్కప్పుడు చేతికర్రలుగా ఉపయోగిస్తాయి. వాగ్భటాచార్యులవారు తన అష్టాంగహృదయం సూత్రస్థానంలో రాత్రిళ్లుకూడా గొడుగు వేసుకున్నట్టయితే శీతాకాలంలో మంచు తలమీదపడదనీ, చెట్టుకిందనుంచి వెళ్తున్నా మీదనుంచి పడే పక్షులరెట్టలు మొదలయినవి మీదపడవనీ వ్రాశారు. ఇవన్నీ చూస్తే గొడుగు ప్రతీవానికీ రాత్రింబగళ్లు పాయరాని మిత్రంలా వుండతగ్గదని నిశ్చయించకతీరదు.

కాని అట్టి పాయరాని మిత్రంఅయిన గొడుగుల్ని తరుచు పోగొట్టుకునే నావంటి వ్యక్తులవల్ల ప్రపంచకానికి, సంఘానికి ఏమన్నా లాభముందా?

స్వవిషయంలో ఈ పోగొట్టుకోవడం యేవిధంగానూ మెచ్చుకోతగ్గది కాదు. ప్రతీనెల జీతంలోనూ ఓ కొత్తగొడుగు కొనవలసివస్తూవుండడం కోరతగిందికాదు. అస్తమానూ కొత్తగొడుగు వేసుకుంటూ గొడుగుల సుందరరామయ్య అనేపేరు సంపాదిస్తే ఒలికేది యేమన్నావుందా?

గొడుగులు మొదలైన వస్తువులు పోగొట్టుకుంటూవుండడంవల్ల స్వార్థానికి యేవిధాన్ని చూసినా నష్టమేకాని లాభంకనిపించదు. కాని ప్రపంచంద్రృష్టిలో ఇది యెంతేనే లాభప్రదమైంది అని అంగీకరించకతీరదు. అందరూ మాగంగాధరంలాగున మూడో క్లాసు చదువుతూవుంటే కొన్నగొడుగుని మూడుకాళ్లముసలి అయినప్పటికికూడా పోగొట్టుగోకుండాను పాడుచేసుకోకుండానువుంటే ప్రపంచంలో గొడుగులవర్తకం ఇప్పటంత విరివిగా సాగడానికి ఆస్కారం యేమన్నావున్నదా? నావంటివాళ్లు కొందరు వుండబట్టి వాళ్లుతఱుచు గొడుగులు పోగొట్టుకుంటూ వుండబట్టి అసలుబుట్ట మార్కు గొడుగుల్నించి నాదారకం గొడుగులుదాకా అన్నీ విస్తరించి అమ్ముడుపోతూ వున్నాయి. నేను ఓకొత్తగొడుగును కొన్నానంటే దాన్ని చేయడానికి కష్టపడిన మనుష్యులందరికీ నేను అన్నం పెట్టినవాడిని అవుతున్నానన్నమాట. కొత్తగొడుగు వేసుకున్నానమనే సంబరం, గొడుగుపరిశ్రమలో తగిలివున్నవారికి యథాశక్తిని సాయంచేస్తున్నామనే సంతోషం పుట్టింది మొదలు పుడకలు ఎక్కేదాకా ఒకేగొడుగుతో ఏకేశ్వరోపాసనచేసే యంబ్రహ్మలకు ఏది? ఇట్లా వస్తువులు పోగొట్టుకునే వాళ్ళను గూర్చి ప్రత్యక్షంచేయదగ్గ పరోక్షమైన మంచితనం, ఘనత ఎంతేనా వుంది.

కొందరు చెప్పేటట్లు ఒక్క అజాగ్రత్త

వల్లనే కాకుండా అతిజాగ్రత్తవల్ల కూడా వస్తువులు పోగొట్టుకోవడం సంభవిస్తుంది. ప్రతీమనిషిబుర్రలోను భగవంతుడు ఒక్కొక్క ఔన్సు జాగ్రత్తను పెట్టాడనుకోండి. ఆ జాగ్రత్తను ఒకేవస్తువుమీద మనం ఉపయోగిస్తే మిగిలిన వస్తువుల గతియేమిటి? మరిన్నీ దేనినిగూర్చిన్నీ అతిజాగ్రత్తకూడదు. అతి సర్వత్ర వర్జయేత్ అని వుండనేవుంది. అతిజాగ్రత్తవల్ల పశువులశాలలోవుంచవలసిన చిట్టుతట్ట పడకగదిలో పందిరిమంచం క్రింద పెట్టే అనుచితాలుకూడా ఒకప్పుడు జరుగుతూవుంటాయి. మరిన్ని అతి జాగ్రత్తగా దాచిన వస్తువునే అతితఱుచుగా మరిచిపోవడం తటస్థిస్తూవుంటుంది. మానవుడి మేధస్సు బహువిచిత్రమైంది. దేన్ని గురించి ఆదుర్దా ఎక్కువగా వుంటుందో దాన్నిగురించే మరుపుజాస్తీగా వుంటుంది. పెళ్ళికి తరలివెళుతూ కంసాలిదగ్గర మంగళసూత్రాలుపట్టుకువెళ్ళడం మరిచిపోయిన సంసారుల్ని నేను ఎంతమందినో ఎరుగుదును.

పరధ్యానంలేకుండా వుండడం మంచిదే. కాని బుద్ధి ఏకతానమైనప్పుడు పరధ్యానం వుండకతీరదు. సుప్రసిద్ధశాస్త్రవేత్త సర్ ఇజాక్ న్యూటన్ పరధ్యానం లోకప్రసిద్ధమైందే. ఇటీవల మరో శాస్త్రవేత్త స్నానం చేద్దామని చెప్పి స్నానపుగదిలోకివెళ్ళి స్నానం చెయడానికి అందులోకి వచ్చేడో స్నానం చేయడం తీరిందో తెలియక కొట్టుమిట్లాడిన సంగతి మనం వార్తాపత్రికల్లో చదివేవున్నాం. మరో శాస్త్రవేత్త రైలుప్రయాణంలో తాను వెళ్ళవలసిన ఊరుమరిచిపోతానేమో అనే భయంచేత రైలుటిక్కెట్టు పుస్తిలా మెడలో వేళ్లాడ తీసుకునేవాడనే విషయం గ్రంథస్థమయ్యే వుంది.

ఏమైనా కాని ఈవిషయంలో రెండుపార్టీలు వుండకతీరదు. గొడుగులు మొదలయిన వస్తువుల్ని తఱుచు పారేసుకునేవారు ఒకపార్టీ, ఏవస్తువుల్ని ఎప్పుడూ పారేసుకోనివారు ఒక పార్టీ. నేను మొదటిపార్టీకే చెందుతాను. మీసంగతికూడా తేల్చుకుని ఏదోపార్టీలో చేరండి. ఎలక్షన్లతో నిమిత్తంలేని ఇల్లాంటి పార్టీలు ఎల్లకాలమూవుండేవే. వాటితో పాటు మనమూ వుండేవాళ్ళమే. పోయేవల్లా గొడుగులు మొదలయినవస్తువులే.

కొందరి దగ్గర వాటికి తఱుచు పోవ్వేకాలం వస్తూవుండడంచేత ఒక కొత్తసమస్య ఏర్పడింది. వస్తువులు పోగొట్టుకునే వారు ఒకపార్టీ, పోగొట్టుకోనివారు ఒక పార్టీ. అయితే పోయినవస్తువులు దొరుకుతూ ఉండే వారు, వానిని ఉపయోగించుకుంటూ వుండే వారు ఇందులో ఏపార్టీకి చెందుతారు? ఎందునా చేరని స్వతంత్రపార్టీ అంటారా? మన పోయిన వస్తువులను వాడుకునే అస్వతంత్రుల్నిగురించి ఏమి చెప్పడానికిన్నీ మనం అస్వతంత్రులమే.

తల్లి కానొల్లని స్త్రీ భార్య కూడ కారాదు

రచయిత:

మాలే కృష్ణ

శ్రీమతి వేమల విశాలాక్షిగారు 'తల్లి నగుట నాకు ఇష్టములేదు' అని 1935 నవంబరు ఆంధ్రభూమిసంచికలో వ్రాసిన వ్యాసమునందలి ముఖ్యాంశములను ఒక్కొక్కటిగా తీసికొని పరిశీలించవలసియున్నది.

'ఆడది చెయ్యవలసిన పనుల్లో కడుపుతో ఉండడంవకటి ..శ్రమకరం అయింది ..కష్టావహం అయింది.' అని వ్యాసం ప్రారంభించబడినది. మొదటి వాక్యములోనే రచయిత్రికి నాకు భేదభావము పొసగినది. ఏమంటే 'ఆడది చెయ్యవలసిన పనుల్లో కడుపుతో ఉండటం ఒకటి' అని చెప్పటంలో సంఘమో, లేక మరెవరో (నాకు తెలియదు) ఆడదానిని యితర సాంఘికనియమాలను వలె 'కడుపుతో ఉండమని' నిర్బంధించినట్లు, వ్యాసరచయిత్రి తలంచెనని తోచుచున్నది. అది సత్యముకాదని ముఖ్యముగా తెలిసికొనవలసియున్నది. వయోప్రమాణమును బట్టి వలపు స్త్రీపురుషులకు కలుగును. ఇద్దరిలో ఎవ్వరును ఈప్రేమాగ్నికి తాళజాలరు. ఇది ప్రపంచసృష్టియందు సర్వజీవులలోను సహజము. అంతకంటె భిన్నముకాదు. ఏసంఘాధికారముయొక్క నియమముకాదు. ప్రకృతిస్వభావము ననుసరించి స్త్రీపురుషులు- తమ నవయౌవన శారీరక, మానసిక భావములను పొంది, కామోపాసకులగుచున్నారు. తత్ఫలితముగా స్త్రీ గర్భముధరించుచున్నది. కాని పురుషుడు ధరించుటలేదు. ప్రకృతిధర్మ మిట్లున్నదని గ్రహించవలయునేకాని ఏసంఘముగాని, ఏవ్యక్తులుగాని శాసించుటలేదని తెలియవలయును. దీనినిబట్టి 'ఆడది చెయ్యవలసిన పనుల్లో' అని అనుటకంటె 'ఆడది చేయదగిన ధర్మములలో' అనుట బహుసమంజసముగానుండును. ఇది పురుషస్వభావమునకు సృష్టిలో ధర్మముగా లేదు. అందువలన స్త్రీలు లోపభూయిష్టమైన నేటి మనదేశకాలపరిస్థితులనుచూచి, తమ సహజధర్మనిర్వాహణముగూర్చి తలంచి పురుషులపై ఈర్ష్యాళులై తమ అభాగ్యస్థితినిగూర్చి నిందించుకొనుట ఎంతమాత్రము పాడిగాదు. శ్రమకరమయినదనీ. కష్టావహమయినదనీ తలంచుట, లోకానుభవమునకు భిన్నముగా నున్నదని నిశ్చయముగా నిరూపణ చేయవచ్చును.

గర్భిణీస్త్రీవిషయములో వ్యాసమున చెప్పబడ్డ కూడదులనుబట్టి తెలియచేయబడిన దేమనగా, గర్భముదాల్చినస్త్రీ దీర్ఘకాలము (తొమ్మిది లేక పదిమాసములు) మోయవలెనని, జిహ్వ, చక్షురింద్రియములను అరికట్టవలసియుండునని, అనారోగ్యవతియగునని, సామాన్యస్వభావమునకు భిన్నముగా తినరాని వస్తువులయందు రుచికలుగునని, యింకను డోకలుకలుగునని. ఇచ్చట ఉన్న విషయములను ఉన్నట్లుగానే వ్యాసరచయిత్రి చాల లెక్కతో పేర్కొనినది. అంతేగా

కుండ డాక్టరులను మారుపేరుతో వేవిళ్ళని పిలచువారిని వైద్యులను (మోసగాళ్ళని) తన ఉద్రేకముకొలది తాననవలసినది అని- ఆభావమును నిట్టూర్పుతో ముగించినట్లు ఇల్లా మోసగింపబడటముకంటే స్త్రీలు గర్భధారణవ్యాపారాన్ని విరమించుకోవడం మంచిదని వ్రాసెను. వీటిలో ఏదిన్నీ ఎక్కువ బలవత్తరకారణముగా తోచలేదు. సినీమాలకు పోవటానికి, తనకిష్టమున్నది తినటానికి వీలుకాదని కేవలం ఈలాటి కారణములతో 'తల్లినగుట నాకు ఇష్టములేదనుట' చాలా అసమంజసముగా నున్నది. రచయిత్రి తన వ్యాసములో పేర్కొనిన అన్ని కారణములు అందరియందు ఒకేపర్యాయము కలుగవు గనుక ముఖ్యముగా ఇప్పుడు పైన పేర్కొనిన కారణములపై 'తల్లినగుట నాకిష్టములేదు' అని ఏస్త్రీయు నిశ్చితాభిప్రాయమునకు వచ్చుట ఆక్షేపణీయమేయగును. వైద్యునివిషయములో చెప్పినది సత్యదూరముకాదు గాని, అందుకు ఇంతదారుణ నిశ్చయమునకు గడంగుటయా? వైద్యులందరు అట్టివారై యుందురనేనా రచయిత్రి యొక్క యుద్దేశ్యము?

తరువాత పేరాకూడా పరిశీలించి చూచెదము. ఇందులో మరీ ఒక విచిత్రకారణమును పాఠకులను ఆకర్షించేటట్లు చక్కగా వ్రాసినది. ప్రతివాక్యములోని విషయము నిజమే, కాని 'అందమంతాపోయి వికృత రూపంవస్తుంది. కళాదృష్టిగల కళ్ళకు . వికారం...'అంటూ వ్రాసినవాక్యాలు సముచితములుగా లేవు. నాదృష్టిలో చూలింతితనమందు వికృతరూపము కనిపించదు. వికారము స్ఫురించదు. స్త్రీ ప్రకృతిలో నుండు సృష్టిపై చిత్తమును ఆయాపరిస్థితులను (వయస్సు, కాలము, దేశము మొదలగు)బట్టి అందమును అనుభవించుట 'కళాదృష్టి' యగును. నిశ్చలప్రేమమయులగు దంపతులు, ఒకపరి తమ సహజయావనదశను సంపూర్ణముగా సంతృప్తినొంది, పిమ్మట సంతానమునుపొంది తిరిగి తామనుభవించిన యావనదశయందే మునిగి తేలవలెనని తలంచువారు- సహజకళకు- దూరులగుచున్నారు. స్త్రీపురుషుల యిద్దరియొక్క యావనదశ దాటినతోడనే, వారి మనోభావములు పరిణామము పొందుచుండును. వారి బాహ్య, అభ్యంతర సమస్తవిషయములలో సర్వేంద్రియముల యొక్క తృప్తి వేరువిధముగా నుండును. కనుక ఏపురుషుడుగాని స్త్రీగాని యిందుకు భిన్నముగా ప్రయత్నించునో వారు ప్రకృతి యందలి సౌందర్యమును (కళను) ఉపాసించి అనుభవించలేరు. వారు తమ 'భార్యను' లేక 'భర్తను' ఒకేదశలో (కామమునకు కారణమైన అందమునందు విషయలోలురై) శాశ్వతముగా అట్లానే ఉండవలెననుట, తమ మనస్సులందు బానిసప్రవృత్తి కలిగించుకొనుటయే యని నాయుద్దేశ్యము. ఈయందమును ప్రకృతి నెదిరించి ఎంతకాలము నిలుపగలరు? ఆకాలములో వాళ్ళనుభవించగల సౌఖ్యమెంత? అది స్వాభావికమా? అస్వాభావికమా? అను విషయము తెలిసికొనవలసియున్నది.

'ఏవిధంగాచూసినా నష్టమేకాని లాభం లేని వ్యాపారం మనమెందుకు చేయుట?' ఈ వాక్యముతో రచయిత్రి ముందుచెప్పిన కల్లబొల్లి కారణాలన్నిటికంటే, ఏదో ఒక గొప్ప కారణము తనదృష్టిలో ఉంచుకొని కొంత అలజడిచేయాలని కనిపిస్తూఉన్నది. కాని లాభంగలవ్యాపారము స్త్రీలకు ఎట్లాంటిదో ఈమె తన మనోభావమును ఎక్కడా తెలియపరచి

ఉండ లేదు.

పై కారణములన్నియు చూచినచో ఈమె యందు స్వార్థపరత్వము కనుపించుచున్నది. అంతేగాకుండా వయోప్రభావమువలన కలిగిన కామోజ్జ్వలనము తెలిసియున్నచో, తాత్కాలికపు ప్రసూతికష్టములను, అందమును గూర్చి (యింతగా వచించుట) పొసగియుండదు. విషయముయొక్క రెండుపక్షములను చూడక, ఒకేపక్షము మాట్లాడుట ఏటిపాడి? అందమును ఎవ్వరైనను నిర్వచించగలరా యని నాసంశయము.

సామాన్యమైన ఆరోగ్యస్థితిలోనున్న ప్రతి స్త్రీయు గర్భముదాల్చి సుఖప్రసవమును పొందుననుట నిశ్చయము. గర్భముదాల్చిన స్త్రీ నవమాసములు మోయుపర్యంతము స్వాభావికమగు ప్రకృతి విలక్షణములచే కాపాడబడుచుండును. కావున ప్రత్యేకించి విశేషకారణములుండినతప్ప కేవల మనారోగ్యముకలుగునను భావముతో 'తల్లి నగుట నాకిష్టములేదనుట' సత్యసమ్మతముగాదు. ఎంతమంది (పనిపాటలుచేసి జీవించువారిలో) సహజముగ ఏ యాడంబరము, కష్టము లేకుండా కనుట లేదు? ప్రతిస్త్రీయు పురుషునికంటే 'కొన్ని ఆరోగ్య విధానములను' యీవిషయమందు ఎక్కువగా నేర్చుకొనవలసియుండునని ఒప్పుకొనెదను. ఆ ఆరోగ్యవిధానములు చాల కష్టమైనవిగావు.

'...ప్రసూతివైరాగ్యం అని వేదాంతులు ఆక్షేపిస్తారు......స్త్రీ ప్రసూతివేళ సముద్భూత సంకటానికోర్చి......వేదాంతుల అపహాస్యానికి గురికావడంకంటే అసలు ఆ వ్యాపారం మానేస్తే మంచిదికాదూ?' ఈ కారణముచూస్తే మరీ చిత్రంగాఉన్నది. ఇదొక కారణముగా చెప్పుట చాల పేలవముగా ఉన్నది. స్త్రీలకు ప్రసూతి వైరాగ్యము తమజీవితానుభవములో గోచరమగుచున్నచో, పురుషులకును దానికి సమానముగా స్మశానవైరాగ్యం అనేది పీనుగను దహనముచేయుటకు స్మశానవాటికకు వెళ్ళినప్పుడల్లా కలుగును. అప్పుడు పురుషులు దారాపుత్రాదులను ఈలోకముననే మరచిపోయి యీసంసారసుఖములను మైమరచిన వారివలె వైరాగ్యమును పొందినట్లు తలంతురు. స్త్రీ ప్రసూతిసమయమునందు తానెంత వైరాగ్యమును పొందునో, పురుషుడును యీసమయమున అంత వైరాగ్యమును పొందును. చివరకు ఇద్దరి వైరాగ్యము ఒకవిధముగనే ఉండును. కాబట్టి ఒకరిని ఒకరు హేళనచేసికొనుటలో అర్థములేదు. స్త్రీపురుషభేదములేకుండా నిత్యైకజీవనములో ప్రతివారికి వేదాంతము (విజ్ఞానము) కలుగుచుండును. వేదాంతులందరు పురుషులేనా? స్త్రీలలో లేరా? కనుక పరిహసించువారెవరు? అందరు సమానులే ఇట్టి సామాన్యకారణములను పురస్కరించుకొని స్త్రీపురుషులకు భేదము కలిగించుట మంచిది కాదు.

నాగరికతబలసినకొలది ప్రసవవేదన ఎక్కువగునని, అనాగరికత ఉండినచోటనే ప్రసవవేదన తక్కువగా ఉన్నదని చెప్పినమాట సత్యమే. ముందు ముందు నాగరికత ఇంకా ప్రబలుతుంది కాని తిరిగి మళ్ళదు అని చెప్పుట సాహసమేయని తలంతును. ఈజోస్యమునకు నాగరికతపై గల పక్షపాతమే కారణము గాని వేరుకాదు. నాకుమాత్రము నాగరికత అనాగరికత వేరువేరు ప్రమాణసిద్ధాంతములుగా తోచవు. నాకు దేనిమీదను పక్షపాతము లేదు. మానవాభ్యుదయమునకుపై రెండింటిలో ఏది ఎంతెంత అవసరము

లో అంతవరకే అలవరచుకోనేదము. అంతే గాని దేనికిని బానిసలము కాజాలముగదా!

'మాతృత్వం అనేది నెమ్మదినెమ్మదిగా జరిగే ఆత్మహత్య' అని ఒక సుప్రసిద్ధశాస్త్రవేత్త అన్నాడు అని వ్యాసకర్త్రి వ్రాసినది. ఆ సుప్రసిద్ధశాస్త్రవేత్త నుడువులను తన వ్యాసమునందు కూర్చుకొన కలిగెనేగాని, వానిభావములను అంతర్గతము చేసికొనలేదని చెప్పుచున్నాను. గర్భధారణవలన పైనచెప్పిన ప్రతి విచిత్రకారణముచేతను 'మాతృత్వం ... ఆత్మహత్య' అని ఆ మహానుభావుడు వచించియుండడని గట్టిగా చెప్పగలను. ఆ మహాశయునివాక్యము ఒక మహదాశయముపై ఆధారపడియుండును. నానాదేశములలో ప్రభుత్వము, ప్రజలు మాతృసంరక్షణావిధానమును ఆరోగ్యవిధానములను ప్రసూతివైద్యములందు తగు శ్రద్ధతీసికొనక పోవుటచే 'మాతృత్వం .. నెమ్మదినెమ్మదిగా జరిగే ఆత్మహత్య' అని నుడివియుండును. నిజముగా ఆయన చెప్పినది గొప్పవిషయము. కావున అందరును ఈ విషయమును జాగ్రత్తగా గమనించతగినది. 'మాతృత్వం... ఆత్మహత్య' అనే వాక్యముయొక్క భావములను విమర్శించకుండా, విపరీతార్థములను తీసికొని మాతృత్వమును నిషేధించుట పాడిగాదు. మాతృత్వనిషేధము ముందు నేను వ్రాసినట్లు కొంతమందికి తప్ప అందరికి పనికిరాదు. దూరదృష్టితో చెప్పిన పనియుకాదు. వర్తమానకాలమున పండిత నెహ్రూవంటివాడు గొప్పపుత్రుడు అని పిలువబడినప్పుడు, ఎవరు తానట్లు కావలెనని కోరుకొనరు? ఏతల్లి అట్టి సంతానము పొందుటకు ఉవ్విళ్ళూరదు? తరువాత చివరకు 'మోతీలాల్'వలె అదృష్టవంతుడగు తండ్రి కావలెనని ఎవ్వరు ఇచ్ఛగింపరు? అట్లనే ప్రతితల్లియు తలంచును. ఇట్టికోరికలలో స్త్రీపురుషులు సమానులే. సమానమైన సంతోషమునే పొందుదురు. నేటి మహానాయకులయొక్కయు, మహాత్ముని వంటి ప్రపంచశాంతిస్థాపకులయొక్కయు మాతృదేవతలు ఎంత సంతోషపడియుందురో! వారి మాతృత్వము ఎంత పరిపూర్ణత నొందినదో చెప్ప ఎవ్వరికి శక్యమగును? ప్రతిస్త్రీయు అట్టి మహదాశయమును కలిగియుండవలెనని నా ఉద్దేశ్యము.

'..వివేకంలేని జంతువులతో సమానమవుతాం.' ఏవో కొన్ని జంతువులు ప్రసవించి చచ్చిపోతవని, మానవులుగూడను అంతే అనుట సాహసము. మనము ప్రతిరోజు చూస్తూఉండే పశ్వాదిజంతువులను, ఎగిరే పక్షులను మొదలగు ఎన్నిజాతుల జంతువులో ప్రకృతి ధర్మమును (గర్భధారణము) నిర్వహించుచున్నవి. మానవస్త్రీలకుగల జబ్బులు అంత విపరీతముగా వాటికి లేనేలేవు. అవి ప్రకృతిని అనుసరించి ఉంటవిగనుక. నిజముగా పక్షులకును, పశ్వాదిజంతువులకును ఉండు కళాదృష్టి మానవులకు లేదు. మానవుడు ఏబుద్ధిచే ఉత్కృష్టత నొందుచున్నాడో, దానిచేతనే (తప్పుమార్గమునుబట్టి) అధోగతిపాలగుచున్నాడు. అందువలన మానవుడు కృత్రిమముగానే యుండి, పశ్వాదిజంతువులకంటే ఎక్కువ సౌఖ్యమును పొందలేకున్నాడు.

'..తనకుమాలిన ధర్మం చెయ్యమంటే బతుకుమీదే ఆశపోతుంది.' ఈ వాక్యము చూచినచో మాతృత్వముయొక్క పారమార్థికతను తెలిసికొనినట్లు కనుపించదు. మాతృత్వమును 'తనకుమాలినధర్మము' అని చెప్పుట స్త్రీకి సమంజసము ఎట్లు కాదో ముందు వివరించియే యున్నాను. పారమార్థికమనిన 'వే

దాంతము' అని వెక్కసపడునేమో? కాని ఈ వేదాంతము ప్రతివారికి నిత్యానుభవము కొంత కలుగుచుండును. అదే శరణ్యమై సంసారిక కష్టములనుండి దొర్లింపును. వేదాంతమను మాటను సనాతనదృష్టితో ఉపయోగించుట లేదు. ప్రతివారి అనుభవములోను అక్కడక్కడ 'దివ్యజ్ఞానము' కలుగుచుండును. కాబట్టి అట్టి దివ్యజ్ఞానమూర్తులపైననే మనకు శాంతి కలుగుచుండును. పశ్వాదిజంతువులు తమ సంతానము నెట్లు ప్రేమతో చూచుకొనుచున్నవో మనము చూచి నేర్చుకొనవలసియున్నది.

'స్త్రీ బాలింతతనమందు పాలను ఉత్పత్తి చేసే ప్రాణంగల యంత్రం అని, అప్పుడు కలిగే రోగాలు చాలఉన్నవని' మొదలగు హేతువువాదమంతా పొట్టువలె ఉన్నది. ముసలితనం నికృష్టదశయని అనుకొనుట చాల అవివేకము. జంతువులు ఈవిధముగా అనుకొనునని నేను తలంపను. అందుచేతనే మానవులు కృత్రిమరూపులంటిని. ఈలోకమును వదలి జీవము పోవునప్పుడు అంతకంటే నికృష్టతయే యగునా! వయస్తంభనము ప్రకృతి విరుద్ధముగా పొందుటవలన కలుగు సౌఖ్యము కొద్దిపాటిది. అనుభవించవలసిన ప్రాపంచికసుఖా లెవ్వి? ఒక్క విషయలోలత్వమేనా? విసుగుకలుగదా కొంతకాలము తీరిన తరువాత.

'అట్టూపిట్టూ పురుషుడిదీ. రవ్వారట్టూ స్త్రీది అవుతూంది...' అనే వాక్యాలలోని కారణం కొంతవరకు సమంజసముగా తోచును. 'తల్లినగుట నాకు ఇష్టములేదు' అనే దారుణనిశ్చితాభిప్రాయమునకు యిది బలవత్తరకారణము కావచ్చును. సంఘములో లవిడిగాతిరుగుచూపైగా స్త్రీలను నిర్బం పురుషులకు యిది సవాలు. ఇంతవరకు సంఘములో అన్యాయముపొందుచున్న స్త్రీలు యీవిధముగా డాంబాయించటములో అర్థములేకపోలేదు. పురుషులు తమకు సమాన హక్కులను సంఘమునందు యిచ్చి, గౌరవించువరకు ఎత్తి పొడవవచ్చును. పూర్వోన్నత్యమును పొందవచ్చును. కాని ఆధునిక స్త్రీసమానస్వాతంత్ర్యముయొక్క భావమును విమర్శించవలసినది. తల్లి కావడం అనే పనినుండి స్త్రీ విరమించడమే ప్రధానసాధనం అని అనుటలో ఎంతమాత్రము ఏకీభవించలేము. వ్యాసరచయిత్రి ఉద్రేకభావముతో చెప్పిన వాక్యములుచూస్తే- ఎప్పటికైన ప్రపంచశాంతికి హానిప్రదమైన యుద్ధము స్వాతంత్ర్యముకొరకై స్త్రీ పురుషులు చేయవలసివచ్చునేమో అని అనిపించును. కాని స్త్రీపురుషులకుగల అవినాభావ సంబంధమువలన అట్టిది జరుగదని రూఢిగా చెప్పుదును. 'తల్లి కావడంఅనే పనినుండి స్త్రీ విరమించడమే ప్రధానసాధనం' అను వాక్యమునందు ఎట్లు సాధనమగును? అందులో ప్రధానమగునదెట్లు? దీనిలోగల భావమేమి? నాకేమియు బోధపడుటలేదు. ముందు స్త్రీ పురుషులయొక్క ధర్మములగురించి వ్రాసియే యున్నాను. వాటికి భిన్నులగుట తమ విధ్యుక్తధర్మముల చేయనట్లే. ఇది చాల కుతర్కవాదముగా కనిపించుచున్నది. వాదించుటలో లక్ష్యమేమి కనిపించుటలేదు.

'నాకుతల్లినగుట యిష్టములేదనుట'లోగల కొన్ని కారణములతో ఏకీభవింతును. అంతేగాకుండా ఒక అడుగు ముందుకువేసెదను. 'నాకుభర్తనగుట యిష్టములేదు' అని చెప్పెదను. అట్లనే స్త్రీయు భార్యయగుట యిష్టపడకూడదు. 'తల్లినగుట యిష్టములేదు' అని చెప్పినచో భార్యయగుట యిష్టమున్నదను భావమునకు చోటచ్చుచున్నది. దానిని బట్టి

స్త్రీ భార్యయై అందు పొందగల సౌఖ్యమునుపొంది తల్లియగుటయందలి తాత్కాలికకష్టములకు వెనుదీయుట ఏపాటి ఆత్మధర్మనిర్వాహణమో, పారుబోతుతనమో తెలిసికొనవలెను. ఈ విషయము పురుషుని పట్ల వర్తించును. ఇంతకంటె ఎక్కువ సంకుచితస్వభావము వేరుండునా ?

పురుషుడు సంఘములో స్త్రీకి చేయుచున్న అన్యాయమునకు, దురాగతమునకు నిందించవచ్చును. పురుషుడు స్త్రీయొక్క సౌభాగ్యమును, నిరోధము చేయకుండా వాని ధర్మము నిర్వర్తించునట్లు చేయవలెను.

నూతనముగా వివాహము చేసికొనిన భార్యాభర్తలు తమను తాము పోషించుకొనలేనప్పుడును, స్త్రీ ప్రతిసంవత్సరము ఎడతెగక సంతానము పొందుచున్నప్పుడును, ఉభయుల యొక్క అనారోగ్యము (రోగములు) వలన సత్సంతానమునకు వీలు కానప్పుడును తల్లినగుట నాకు ఇష్టములేదనుట బాగున్నది. స్త్రీయేగాదు. అప్పుడు పురుషుడును అట్టి మనోనిశ్చయమునకు రావలెను. ప్రతివిషయమును స్త్రీ పురుషు లిద్దరు అన్యోన్యముగా ఢీకొనుట పరమలక్ష్యము. మరొక కారణముచే 'స్త్రీ' వ్యక్తిగతముగా 'తల్లినగుట నాకు ఇష్టములేదు' అని చెప్పవచ్చును. సంసారధర్మంలో ఉండే అర్థపురుషార్థాన్ని, కామపురుషార్థాన్ని పురుషుడు లుబ్ధుడై, స్వార్థపరుడై అనుభవించినప్పుడు- అంటే, పురుషుడు సంఘములో స్త్రీ హక్కులను మన్నించక, తనధర్మములను నిర్వర్తింపనిచో- చేయవచ్చును. ఈ ఒక్క కారణముచేత 'నాకు తల్లినగుట ఇష్టములేదని' స్త్రీ చెప్పుట సముచితము, సత్యసమ్మతముగానున్నది. తదితరకారణములన్నియు నిలువలేనివిగా నున్నవి. పై కార్యముచేత స్త్రీ పురుషుని, సంఘమును సక్రమవర్తనులుగా చేయు యుద్దేశ్యమే యయియున్నది. కాని స్త్రీ తల్లి కాకుండుట పరమౌషధిగాదని తెలియవలయును. వివాహముకాని స్త్రీలు సంఘదురాగతకారణమున 'మేము అవివాహితలుగానుందుమని' చెప్పవలెనేగాని 'తల్లులగుట ఇష్టము లేదనుట' చాల బేలతనముగానుండునని పైన చెప్పిన మాటలను గమనించవలసి యున్నది.

శ్రీమతి విశాలాక్షిగారి తల్లికాకుండుటకుగల కారణములలో చాలవాటికి భిన్నుడనైనను, ప్రధానవిషయముతో ఏకీభవింతును. అవివాహితలుమాత్రము భార్యలు కాకుండ ఉండవలయును.

మణిమాల

వలసరాజ్యములను తిరిగి పొందుట జర్మనీకి ఆర్థికముగ అవసరమా ?

'నేడు జర్మనీ, ఇటలీ, జపాను దేశములు తమకు వలసరాజ్యములు కావలయునని గాఢముగ వాంఛించుచున్నవి. జర్మని సంగతి ప్రస్తుతము ఆలోచింతము. వలసరాజ్యములను తిరిగి పొందుట ఆర్థికముగ జర్మనీకి అవసరమా ? జర్మనీకి యుద్ధమునకు పూర్వముండిన వలసరాజ్యము లన్నిటినుండియు కలిపి అగుచుండిన ఎగుమతులు ఎప్పుడుకాని ఏడు మిలియనుల పౌనుల విలువను మీరలేదు. 1935-వ సంవత్సరమున జర్మన్ దేశము దిగుమతిచేసికొనిన కాఫీగింజల విలువయైన ఆ ఎగుమతులకు అప్పుడు లేకుండెను. యుద్ధమునకు పూర్వము జర్మను వలసరాజ్యములందు వలస నెలకొనిన జర్మనుప్రజలును లెక్కకు మిక్కిలి తక్కువగానుండిరి. ఆ వలసలన్నియు ఉష్ణమండలములందున్నవి. అగుట జర్మనుదేశస్థులు వానియందు వలస నెలకొనుట దుస్తరము. కాగా తమ వలసరాజ్యములను తిరిగి తమకు ఇచ్చినచో తమ ఆర్థికక్లిష్ట పరిస్థితులు తొలగిపోవుననుట ఆధారములేనిమాట యగుచున్నది. జర్మనీయందు జనాభా అధికమగుచున్నచో; బ్రిటన్, హాలెండు, బెల్జియములందుకంటె జర్మనీయందు చతురపుమైలునకు సగటు జనాభా హెచ్చుగా నున్నచో నేటి జర్మను ప్రభుత్వము దేశమున సంతానోత్పాదనమును హెచ్చుచేయుటకున, జనాభాను వృద్ధిపొందించుటకును విశ్వప్రయత్నములు చేయనేల? ఇటలీకూడ ఇట్టిపద్ధతినే అవలంబించుచున్నది. విదేశములందున్న జర్మనుదేశస్థులలో విశేషభాగము ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికాలయందలి సమశీతోష్ణమండలములందు నివశించుచున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రములకు తమ దేశీయులు వలసపోరాదని ఇటలీ ప్రభుత్వమువారి ఆజ్ఞ కావున ఇటలీలో జనాభా సమస్య ఉన్నదని అంగీకరింపక తీరదు. ఇటలీ, జర్మనీదేశీయులు పోయి వలస నెలకొనగల ప్రదేశములు అమెరికా సంయుక్త రాష్ట్రములవంటి సమశీతోష్ణమండలములై యుండవలయును కాని ఆఫ్రికాఖండము (ఇందే పూర్వపు జర్మన్ వలసరాజ్యము లున్నవి.) ఉష్ణమండలములు కాకూడదు. ఇక ముడివస్తువుల సరఫరా అనుకూలముగ లేదు కావున మావలసరాజ్యములు తిరిగి మాకు ఇచ్చివేయవలయునను వాదములోకూడ అర్థములేదు. పూర్వపు జర్మను కాలనీలు ఇప్పుడు లీగ్ యాజమాన్యమున బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియము ప్రభుత్వముల చేతులలో మాండేటరీ రాజ్యములుగ నున్నవి. ఆవలస రాజ్యములందు అన్నిదేశముల పౌరులకును ఆర్థిక వ్యాపారము గావించుకొనుటకు హక్కుగలదు. జర్మనుపౌరులకైన ఎట్టి నిషేధమును లేదు. అన్ని దేశములవారికిని అచ్చట సమానమైన హక్కులు గలవు. మరియు వలసరాజ్యములలోని ముడివస్తువుల ధరలు ప్రస్తుతము అతిమందముగనున్నవి. జర్మనువారుకాని ఇటలీవారుకాని ఆ ముడివస్తువులను కొనుటకు వచ్చుచో ఆదేశస్థులు సంతోషపూర్వకముగ ఆవస్తువులను వారికి విక్రయింతురు. నేడు ఉన్నంత సమృద్ధిగా, చవుకగా ముడివస్తువులు ప్రపంచచరిత్రలో మరియేకాలమునందును ఉండిఉండలేదని చెప్పకతీరదు. కావున వలసరాజ్యములను తిరిగి పొందుట జర్మనీకి ఆర్థికముగ అవసరములేదు.

— హెచ్. యన్. యాష్టన్.

* * *

కృష్ణదేవరాయల విజయయాత్రలు

రాజ్యమునకు వచ్చినవెంటనే దక్షిణమున విజయనగరసింహాసనము నలక్ష్యముచేసి తలయెత్తి తిరుగబాటులు కావించిన మండలికుల నందరను ముందు సాధించెను. ఈయొక్క దక్షిణ దిగ్విజయయాత్రయందే కృష్ణదేవరాయల సాహసము, పట్టుదలయైని

కులయెడ ఔదార్యము నన్నియు కన్పట్టినవి : కృష్ణదేవరాయ లెట్టివాడో యెత్తిచూపినవి. ఎత్తివెళ్ళినది శివసముద్రముమీదికి. శివసముద్రమునకు కావేరినది మహాపరిఖ. జలదుర్గమని వాసికెక్కిన ఆదుర్గమును సాధింప బయలుదేరినాడు కృష్ణదేవరాయలు. కావేరీనది పొంగి తుంగతరంగితమయి త్రొక్కి త్రుళ్ళింతలు కొట్టుచుండిన సమయమది. కార్యమా దుస్సాధమయినది. వరదలయందున్న యానది నుత్తరించుటయెట్లు? శివసముద్రమును సాధించుటెట్లు ? ఏమియు నధైర్యము చెందలేదు కృష్ణదేవరాయలు. రాయలు ముందడుగువేసెనా రాయలసైన్యమున పిరికికండయుండెడిది కాదు. ఉపాయము తట్టినది రాయలవారికి. వెంటనే కార్యమునకు పూనుకొనినారు. కావేరీనదినీటిని అన్యమార్గముల మరలించి నది నెండింపజేయు కాలువలు త్రవ్వించినారు- కార్యము కష్టమైనదే. సందియములేదు. కాని, కృష్ణదేవరాయల లక్ష్యము విజయముమీదనే. ఆవతల శివసముద్రదుర్గము ఇవతల తాను. ఇంతే అతనికి కనబడినవి; మిగిలిన చరాచరజగత్తంతయు అతని దృష్టిపథమున నుండి యంతరించినది. రాయలుతలచుకొన్న కాదవా? కావేరి దారియిచ్చినది. రాయలవారి సైన్యములు శివసముద్రమును సాధించి యాకోట బురుజులపై నెక్కి పేర్చియార్చినవి. ఇక నేమి ? దీనితోనే కృష్ణదేవరాయలవారి కీర్తి దశదిశలకు నెగబ్రాకినది. ఇది యొక్కటేనా కృష్ణదేవరాయలు సాధించిన కష్టకార్యము? ఎన్నెన్ని చెప్పను ? ఉదయగిరి- అదిమాత్రమొకపట్టున లోబడినదా ? ఆ కాలమున దుస్సాధములని పేరుమ్రోగిన దుర్గములలో ఉదయగిరి యొకటి. కొండకొట్టుకొననున్నది దుర్గము. ఏటవాలయినది కొండ; కొండ నెత్తముల మీది బురుజులమీద హామేషా సాయుధులై కావలికాయు వీరభటులు- అది గజపతిదుర్గము, సైన్యమునసాంపందలకాలది యే నుగులు. ఇంతటి మహాదుర్గము సాధింపబడినప్పటి మాటలే, చూతమన్న దీమాతో నున్నవాడు ప్రతాపరుద్రగజపతి. కొండమీదిదుర్గమునకు త్రోవ తెలియలేదు ; అసలు లేనేలేదు. ఒక్కటే సన్నని ఇరుకు త్రోవ. ఇక సైన్యములను నడపించుకొని కొండనెక్కుటయెట్లు? దారియేది? చుట్టు మహారణ్యము. పరిస్థితులు చాల విషమముగనున్నవి. చాల నిరాశాపూరితములుగ నున్నవి. అంతేనా? ఉదయగిరిని వదలివెళ్ళవలసినదేనా? ఉదయగిరిని వదలినచో ఇది యొక పెనుభూతమే. ప్రక్కనుండి పొంచియుండి యెప్పుడు విజయనగరము కోటపై కురుకునో ? అట్లయిన సాధింపవెరవు ? ఆలోచించినా డాలోచించినాడు కృష్ణదేవరాయలు. ఉదయగిరిదుర్గము ముట్టడి దీర్ఘకాలముసాగినది. అప్పటికి దుర్గములోనివారికి వస్తుసామగ్రులకు కొదువలేదు; వారికలపులేదు, సొలపులేదు. విజయనగరసైన్యములకు ఆత్రమెక్కువగుచున్నది ఏమిటిదియని; ఓపిక తక్కువగుచున్నది ముట్టడిదీర్ఘముగ సాగినకొలదిని. కాని కృష్ణదేవరాయలకు దుర్గమువశమగుట అలస్యమయిన కొలదిని పట్టువల, శౌర్యము హెచ్చుచున్నది. ప్రాణము పణముగ నొడ్డియైన ఈకోట సాధింపవలె. అంతవరకు లేదు శాంతిలేదని నిశ్చయించుకొన్నారు రాయలవారు. దుర్గమునకెక్కుటకు క్రొత్తదారులు వేయించినారు; అడవికొట్టించినారు. సైన్యములు హతమగుచునేయున్నవి. దుర్గమునకు మార్గములు చక్కబడుచునేయున్నవి. దుస్సాధ్యమనుకొన్న ఉదయగిరి తుదకు రాయలకు వశమయినది. కటకాధిపుడయిన గజపతికి సగముబలము సన్నగిల్లినది. బలములనన్నిటిని తరలించుకొనిపోయి ఇక కొండవీడుచేరి దానిని భద్రపరచుకొన్నాడు. కొండవీడుమాత్రము సామాన్యమయినదా? ఉదయగిరి కేమాత్రమును తీసిపోయిన దుర్గముకాదది. ఉదయగిరికంటెను బలాఢ్యమయిన దుస్సాధ్యమయిన దుర్గమనిపించినది. ఎచ్చటనో కొట్టకొన పర్వతవలయగర్భమున పదిలముగ గట్టిన దుర్గమది. ఏమిబుద్ధి అని రాయలవారికి మరల ఆలోచనయే. ఈతడవకూడ రాయలవారి బుద్ధివైభవము వలన దుస్సాధమనుకొన్న కొండవీడు సాధింపబడినది. నడచప్పరములుకట్టి కొండవీటి కోటకొమ్మల

కగబ్రాకి విజయనగరసైన్యములు తుదకు దానిని సాధించినవి. అపూర్వముకదా రాయలవారి ప్రజ్ఞావిశేషము! ఇంతెందుకు కృష్ణదేవరాయలువారు ఉత్తరమునకు ఎత్తి వెళ్లుచున్నప్పుడు శితాబుఖాను డడ్డగించినపుడు మాత్రము—కృష్ణరాయలవారు బెదరినారా? వెరిచి వెన్నుచూపినారా? విజయనగర సైన్యములు రెండుకొండలనడుమ గొందిగుండ పోవలసిన యవసరము కలిగినది. పరిసరప్రాంతమంతయు మహారణ్యము. ఏప్రాంతమున, ఏమూల శత్రుసైన్యము నక్కియున్నదో? కటకము గజపతికి విధేయసామంతుడయిన ఆశితాబుఖానుడు తనస్వామి భక్తిని వెల్లడించుచు తన శక్తివంచనలేక శత్రుసైన్యముల దునుమాడుటకు ప్రయత్నించినాడు. ఈకొండమీద సైన్యము, ఆకొండమీదసైన్యము. ఇనుపకవచములను గూడ దూసుకొని పోగల బాణజాలమును ప్రయోగించుధానుష్కులు శితాబుఖాను సైనికులు. కుడివైపున బాణవర్షము. ఎడమవైపున బాణవర్షము. విజయనగర సైన్యమునకు మారు మాటాడుటకు అవకాశములేదు. యాత్రసాగింపవలసినదే; శత్రుబాణప్రయోగమునకు గురియై చావవలసినదే. వెరచినవా విజయనగర సైన్యములు? లేదు. రాయలవారి యాదేశము వచ్చియు కూడ నిర్వర్తింపవలసినదే. రాయలవారీమహాభయంకరదృశ్యమును వీక్షించినారు. సైన్యములను గొన్నిటిని ఆమహాగహనసీమలగుండ మార్గాంతరముల బంపినారు; శీఘ్రకాలముననే శితాబుఖానుని సైన్యము అటు క్రొత్తగవచ్చిన విజయనగర సైన్యవిభాగమునకు ఇటుమోహరించియున్న సైన్యవిభాగమున్నకు నడుమచిక్కినది. అపూర్వమైనదికదా ఈసన్నివేశము. ఫలితము కృష్ణదేవరాయలకు విజయమే. ఇటు తెన్నని ఆతని ప్రజ్ఞావైభవమును, యుద్ధవిద్యాకౌశలమును ప్రదర్శించునవి? ఆకాలముననే కాదు అంతకు పూర్వకాలమునను అంతటి మహాయోధుడుద్భవించి యుండలేదనుట సత్యము.

—గోలకొండపత్రిక.

—వల్లంపల్లి సోమశేఖరశర్మ.

వచ్చుచున్నది ! వచ్చుచున్నది !

బెజవాడ సరస్వతీ టాకీస్ వారి రెండవ తెలుగు టాకీ

కనకతార

ఈ మార్చి నెలలో విడుదల అవుతోంది.

ఈ చిత్రము సర్వవిధముల 1937 లో తయారగు చిత్రములకు తలమానికముగా నుండుట నిశ్చయము.

నటులు, నిర్వాహకులు.

స్టూడియో వారి విజయ

ముఖ్యకారకులు :



For Booking Apply to :

SARASWATI TALKIES LIMITED, Bezwada. or

3, Mariappa naick St., Theynampet, Cathedral P. O. Madras.

స్పెయిన్ దేశపు భోగట్టా

స్పెయిన్ దేశమున 1931-వ సంవత్సరము ఏప్రియల్ 14-వ తేదీని ప్రజాస్వామికప్రభుత్వము (రిపబ్లిక్) ప్రకటింపబడెను. 1931 జూన్ 28-వ తేదీని జనరల్ ఎలక్షనులు జరిగెను. రాజ్యాంగవ్యవస్థను నిరూపించుచు ప్రెసిడెంటును ఎన్నుకొనుట ప్రధానలక్ష్యము. కార్టిస్ అనబడు ఆదేశపు పార్లమెంటు 1931 జూలై 14-వ తేదీని తొలిసారి సమావేశమయ్యెను. 1931 డిశంబరు 9-వ తేదీని ఆ రిపబ్లిక్ యొక్క కాన్‌స్టిట్యూషన్ సభలో ఆమోదింపబడెను. 1933 అక్టోబరు 9-వ తేదీని ఆపార్లమెంటు డిజాల్వు చేయబడెను. 1933 నవంబరు 19-వ తేదీని క్రొత్తఎన్నికలు జరిగెను. ఈరెండవ పార్లమెంటు 1936 జనవరి 7-వ తేదీని డిజాల్వుచేయబడి 1936 ఫిబ్రవరి 16-వ తేదీని క్రొత్త ఎన్నికలు జరిగెను. క్రొత్తపార్లమెంటులో 473 సభ్యులు.

రాజ్యాంగవ్యవస్థ

స్పెయిన్ రిపబ్లిక్. ప్రభుత్వము ఏమతమును అభిమానింపదు. స్పానిష్ భాషయందే అన్ని రాజకీయవ్యవహారములు సాగును ఎరుపు, పసుపు, ధూమ్రవర్ణము రిపబ్లిక్ యొక్క రంగులు. మాడ్రిడ్ రాజధాని. కార్టిస్‌కు నాలుగేండ్లకొకసారి ఎన్నికలు. 23 సంవత్సరములకుపైబడిన స్త్రీపురుషు లెల్లరు ఓటింగు హక్కు కలిగియుందురు. ఎన్నుకొనబడిన సభ్యులకు ప్రయాణపు బత్తెములుగాక నెలకు కొంత నిసపైన జీతముకూడ ఇత్తురు.

రిపబ్లిక్ అధ్యక్షుడు స్పానిష్ పౌరుడై నలుబదియేండ్లకు పైబడినవాడై ఉండవలెను. అతని ఉద్యోగకాల పరిమితి ఆరు సంవత్సరములు. తిరిగి ఆరుసంవత్సరములు గతించువరకు అతడు అధ్యక్షుని ఎన్నికకు నిలువరాదు. ప్రధానమంత్రిని ప్రెసిడెంటు నియమించును. కార్టిస్‌లోని సభ్యులు నూటికి ఆరువదిమందికి పైగా వాంఛించుచో ప్రెసిడెంటును ఆపదవినుండి తొలగింపవచ్చును.

1936 ఫిబ్రవరి 19-వ తేదీని ఏర్పడిన ప్రభుత్వమున పదునుగ్గురు మంత్రులు.

వైశాల్యము, జనాభా.

బేలరిక్, కానరీద్వీపములతో కలుపుకొని స్పెయిన్ వైశాల్యము 196,607 చతురపు మైళ్లు. 1930 లో జనాభా 23,563,867 ముంది. ఏబది రాష్ట్రములక్రింద విభజింపబడియున్నది.

1934 డిశంబరు 31-వ తేదీని గొనిన లెక్కలప్రకారము అచటి పట్టణముల జనాభా ఇచ్చట ఈయబడుచున్నది.

బార్సిలోనా	1,148,129
మాడ్రిడ్	1,048,072
వాలెన్‌షియా	352,802
సెవిల్లా	238,727
మాలగ	203,844
జారగోజా	189,062
బిల్బో	175,898
మూర్సియా	166,341
గ్రానడా	124,681
కార్డొబా	117,919

స్పెయిన్‌నుంచి సాధారణముగ అర్జెంటినా, కూబా, బ్రేజిల్, యురగ్వే, మెక్సికో దేశములకు వలసపోవుచుందురు.

మతము

స్పెయిన్‌లో చాలమంది రోమన్ కాథ

లిక్ మతస్థులే. అయినను ప్రభుత్వము ఏమ తముపైనను ప్రత్యేకాభిమానము చూపదు.

విద్య

నూటికి 47 గురు చదువను వ్రాయను నేర్చినవారు. ప్రాథమికవిద్య నిర్బంధమై యుండవలయునని కాన్‌స్టిట్యూషనులో కలదు. విద్యావిషయమున స్పెయిన్ పదునొకండు మండలములుగ విభాగింపబడినది. ఒక్కొక్క మండలమున ఒక్కొక్క యూనివర్సిటీ. ఆమండలమున విద్యావిధానమంతయు ఆ యూనివర్సిటీ ఆధీనముననుండును. 1933-వ సంవత్సరమున ఈ పదునొకండు యూనివర్సిటీలయందును 32,905 గురు విద్యార్థులును 2,047 విద్యార్థినులును ఉండిరి.

న్యాయపరిపాలన

డిస్ట్రిక్టుకోర్టు, కోర్టు ఆఫ్ ఫస్టు ఇన్‌స్టెన్సు, ప్రావిన్షియల్ హైకోర్టు, డివిజినల్ హైకోర్టు, సుప్రీమ్‌హైకోర్టు న్యాయపరిపాలన కావించును. 1932 సెప్టెంబరు 6-వ తేదీని మరణశిక్షను రద్దుచేసిరి కాని 1934 అక్టోబరు 11-వ తేదీని తిరిగి నెలకొల్పిరి. ముప్పది ఏళ్ళ జయిలుశిక్షకూడ విధింపబడును.

సైన్యము

స్పెయిన్‌నందు మిలిటరీ సర్వీస్ నిర్బంధమైనది. ప్రతిపౌరుడును తప్పని సరిగ రెండు సంవత్సరములు సైనికశిక్ష నందవలయును. 1935 లో ఈవిధముగా 80,000 మంది సైనికశిక్ష నందిరి. స్పెయిన్ సరిహద్దులను కాపాడుటకు సరిహద్దులందును తీరప్రదేశములందును పెక్కు కోటలుగలవు.

పరిశ్రమలు

స్పెయిన్‌నందు వ్యవసాయమే ప్రధాన పరిశ్రమ. 124,615,669 యకరము నేలలో అచట 1932-వ సంవత్సరమున 5,092,876 యకరములు ఆలివ్ వ్యవసాయమునకు, 3,803,098 యకరములు ద్రాక్షతోటలకు, 1,244,495 యకరములు పండ్లతోటలకు, 40,821,353 యకరములు ఇతర వ్యవసాయములకు, 58,397,009 యకరములు గడ్డిబీళ్ళకు వినియోగింపబడినవి. 1921-వ సంవత్సరమునుండియు స్పెయిన్ దేశమున పొగాకు పండింపబడుచున్నది. పట్టు, నార, తేనె, లక్క మున్నగునవి ఇతర పరిశ్రమలు. లోహసంపదయు గలదు.

వర్తకము

ఈదేశము యునైటెడ్ స్టేట్సు, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సు, అర్జెంటైనా, ఇటలీ, ఇండియా మున్నగు దేశములతో ఎగుమతి దిగుమతులను జరుపుచున్నది.

ఓడలు

1935 జూన్ 30-వ తేదీనాటికి స్పెయిన్ రిపబ్లిక్‌నకు 877 స్టీమర్లు, 57 ప్రయాణపు ఓడలు ఉండినవి. అవిమొత్తము 1,177,732 టన్నులవి. బార్సిలోనా, బాల్బో, కేడిజ్ ఇవి గొప్ప రేవుస్థలములు.

బాటలు

1933 లో 60,412 మైళ్ళరోడ్లు, 8,458 మైళ్ళ రైలుబాటలు గలవు. రైలుకమ్ముల నడిమిదూరము ఫ్రాన్సులోని రైలుకమ్ముల నడిమిదూరమునకు విభేదించియుండును. 830 మైళ్ళ ట్రాములు. స్పెయిన్‌లో 1933-వ సంవత్సరమున 9,547 పోస్టు ఆఫీసులుఉన్నవి

వలసరాజ్యములు

128,696 చతురపుమైళ్ళ వైశాల్యము కలిగి 943,686 జనాభాతో ఒప్పు రియోడి ఆరో, అడ్రార్. ఇఫ్‌ని, స్పానిష్ గినియా, ఫెర్నాన్డో, స్పానిష్ మొరాకో మొదలయిన వలసరాజ్యములు స్పెయిన్‌కు గలవు.

విజ్ఞాన విషయములు

గడ్డిలో 4,500 రకాలు ఉన్నాయి.

... .

18 ఏళ్ళకుపైబడి 45 ఏళ్ళకు లోపుగఉన్న ప్రతి కర్షకుడు రష్యాలో ఇకమీదట నెలకు ఆరు రోజుల చొప్పున జీతంలేకుండా రోడ్డుపని చేయాలి.

... ...

ప్రపంచంలోవున్న పక్షులను అన్నిటినీ ఒకసారి నాశనంచేస్తే ప్రపంచం అంతా ఏడేళ్ళల్లో పురుగుల మయం అయిపోతుందని శాస్త్రవేత్తలు చెపుతున్నారు.

... ...

ఇంగ్లండులోను వేల్సులోను కలిపి మోటారిస్టులు 1935 లో జరిమానాలక్రింద 375,000 పౌనులు చెల్లించారు.

... ...

జోహాన్సుబర్గు జూబిలీ ప్రదర్శనశాల కట్టడానికి 15,000,000 మేకులు ఉపయోగింపబడ్డాయి.

... ...

యుద్ధంముగిసినతరవాత ఇప్పటివరకు లండను విశ్వవిద్యాలయంలో డెబ్భయిమంది గ్రుడ్డివారు డిగ్రీలు పొందేరు.

... ...

గ్రేటు బ్రిటన్‌లో 47,000 మంగలిషాపులు, 15,000 మందులషాపులు ఉన్నాయి.

... ...

ప్రపంచం అంతటిమీదా ఏడాదికి 19,000,000 టన్నుల కాగితం వాడబడుతూవున్నది. అందులో నూటికి పదివంతులు ఒక్క అమెరికాయే వాడుతూవుంది.

... ...

బ్యాంకింగునుగూర్చి మొదటిసారి క్రీ. పూ. 7000 లో బాబిలోనియాలోని రికార్డులలో చెప్పబడ్డది.

1914 దరిమిలాను ఫ్రాన్సులో పిచ్చితనం నూటికి 40 పాళ్లు పెరిగింది.

... .

మాస్కోలోని పబ్లిక్ లైబ్రెరీలో 6,500,00 పుస్తకాలున్నాయి.

... .

పోస్టాఫీసుల్లో ఉద్యోగానికి కుదిరియున్నవా సంఖ్య 2,45,000.

... ...

నీరుల్లిపాయతరిగితేకాని ఒలుస్తేకాని చేతులకి పట్టే వాసన ఆవపిండితో ఆచేతులు రుద్దితేపోతుంది

... ...

గ్రేట్ బ్రిటన్‌లో 1935 లో వార్తాపత్రికల్లో ప్రకటనలక్రింద 25,000,000 పౌనులు ఖర్చుపెట్టబడ్డది.

... .

సాళువడేగ అనబడే పక్షి సముద్రమట్టాని 29000 అడుగుల లేక 5½ మైళ్ళ ఎత్తుకి ఎగురుతుంది ఇంతఎత్తుకి మరియేపక్షీన్నీ ఎగరలేదు.

... ...

ఆడమిడత ఒక్కసారి 600 మొదలు 800 గ్రుడ్లవరకు పెడుతుంది. ఏడాదికి అది 150,000 మొదలు 200,000 వరకు గ్రుడ్లను పెడుతుందని అంచనా వేయబడ్డది.

... ...

బాగా ఎదిగిన పట్టుపురుగు 2¼ అంగుళాల పొడుగు వుంటుంది.

.. ..

అన్నిఖండాల్లోకి ఆసియాఖండం పెద్దది. దాని వైశాల్యం 17,250,000 చతురపుమైళ్ళకు పైబడివుంది.

అనుభవవైద్యాని అమృతసూక్తులు

ఎదిగేపిల్లల్ని మెత్తటి పరుపులమీద పడుకో పెట్టకూడదు.

... ...

ఒక్క తేలువిషం తగిలినప్పుడు తప్ప మిగతా ఏ విషజంతువువిషం తగిలినా తగిలినభాగాన్ని వెచ్చ చెయ్యకూడదు.

... ...

ఉదయంలేవడంతోటే తోముకున్నట్టే రాత్రి పడుకోబోయేటప్పుడుకూడా పళ్లు తోముకోవడం మంచిది.

... ...

నూతుల్లో ప్రతీ వేసవికాలంలోను మన్నుతీయించడం మంచిది.

... ...

వరిఅన్నం తిన్నగంటలో జీర్ణమైపోతుంది. కాచినపాలుజీర్ణంఅవడానికి రెండుగంటలు పడుతుంది.

... ...

మూతపెట్టకుండా వుడికించబడ్డ పదార్థాలలోని ఎ. విటమిను నశించిపోతుంది.

... ...

నీళ్లు ఎక్కువగాపోసి ఉడికించిన పదార్థాల్లోని బి. విటమిను నశించిపోతుంది.

... ...

పదార్థాలని చాలాసేపు ఉడికిస్తే వానిలోని సి. విటమిను నశిస్తుంది.

... ...

మరబియ్యంలోను, టీలోను, కాఫీలోను విటమినులు అసలే లేవు.

... ...

అగ్నిమాంద్యానికి ఉష్ణోదకపానం మంచిమందు.

... ...

గులాబిమొగ్గల పచ్చడి, రేలగుజ్జు పచ్చడి మూలశంకరోగులకు పథ్యకరమైంది.

నెమలిఈకలపొగ ఎక్కిళ్ళను పోగొడుతుంది.

... ...

కలరారోగులకు నల్లమందు వాడకూడదు.

... ...

ఇన్ఫ్లూయంజాలో రోగికి చలిగాలి, చన్నీళ్ళు తగలనీయకూడదు.

... ...

మలబద్ధకమువల్ల నిద్రానాశనం కలుగుతుంది.

... ...

ఎంతసేపటికి నిద్రరాకపోతూవుంటే కొంచెం తేనె కళ్ళల్లో వేసుకోవాలి.

... ...

పిప్పరమెంటు పువ్వుముక్కను పంటిసందున పెడితే ఎల్లాంటి పంటిపోటైనాసరే వెంటనే తగ్గిపోతుంది.

... ...

వడదెబ్బ తగిలినవారికి వరిపేలాలు ద్రాక్షపళ్లు నీళ్ళల్లో నానవేసి ఆనీటిని తాగిస్తే గుణకారిగా వుంటుంది.

... ...

నెమలిఈకను మాడ్చి తేనెలోకలిపి సేవిస్తే వాంతులు కడతాయి.

... ...

ముక్కునుండి రక్తం అధికంగా వస్తూవుంటే నీరుల్లిపాయరసం పిండితే వెంటనే రక్తం కట్టుపడిపోతుంది.

... ...

హృద్రోగం కలవారు మెట్లుయెక్కడం మొదలైన అయాసకరమైనపనులు చేయకూడదు.

... ...

కంఠస్వరం భేదించినప్పుడు కలింగరాష్ట్రికంధాన్ని తేనెతోకలిపి గొంతులో పట్టిస్తే గుణకారిగా వుంటుంది.

Printed at The Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.

నిజామురాజ్యమునకు

౧. వెంకట్రామా అండు కో; 3993 మార్కెట్టుస్ట్రీట్, శికిందరాబాదు.

అనువారిని ఆంధ్రభూమికి ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యుల సౌకర్యార్థము వీర్లు మాసము మాసము ఆంధ్రభూమి విడిసంచికలు విక్రయింతురు.

౨. కంభంపాటి అచ్యుతానందముగారు, (కమీషన్ ఏజెంటు, ఆనందాయుర్వేదాశ్రమము),

అనువారిని హనుమకొండలో మాఏజెంట్లుగ నియమించినాము.